ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
శుక్రవారం 10 అక్టోబరు 2025



పిచ్చికుక్క స్వైరవిహారం

రావికమతంలో 27 మందికి గాయాలు

- తొలుత అర్ధరాత్రి బీసీ బాలికల వసతిగృహంలో దాడి
- 12 మంది విద్యార్థినులకు కుక్కకాట్లు
- ఉదయం రావికమతం వీధుల్లో మరికొంతమందిపై దాడి
- నాగన్నపాలెంలో రెండేళ్ల బాలుడికి తీవ్ర గాయాలు
- ప్రథమ చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలింపు
- పిచ్చికుక్కదాడిపై కలెక్టర్ ఆరా



పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన రెండేళ్ల బాలుడు చైతన్య వర్ధన్



గాయపడిన వెచ్చా విశ్వ

రావికమతం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):

మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి, గురువారం ఉదయం ఒక పిచ్చి కుక్క స్వైరవిహారం చేసింది. కనిపించిన వారందరిపైనా దాడి చేసి కరిచింది. దీంతో జనం బెంబేలెత్తిపోయారు. రెండేళ్ల చిన్నారి నుంచి 75 వృద్ధుడి వరకు మొత్తం 27 మందికి పిచ్చికుక్క కాట్లు వేసింది. వీరిలో సగం మంది బీసీ వసతి గృహం బాలికలే వున్నారు.

రావికమతం బీసీ బాలికల వసతి గృహంలోకి బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత రెండున్నర గంటల సమయంలో పిచ్చికుక్క చొరబడింది. ఈ సమయంలో ... మిగతా 8వ పేజీలో

వైసీపీ శ్రేణులు హల్‌చల్

అధినేత జగన్ పర్యటన సందర్భంగా అత్యుత్సాహం

- కొత్తూరు, కశింకోట, తాళ్లపాలెంలో హైవేపై గుంపులుగా చేరి ట్రాఫిక్‌కు ఆటంకం
- పోలీసులు వారించినా.. బేఖాతరు
- ఐదు కిలోమీటర్ల మేర స్తంభించిన ట్రాఫిక్
- తీవ్ర ఇబ్బందులు పడిన వాహనదారులు, ప్రయాణికులు



మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో వైసీపీ అధినేత జగన్ కాన్వాయ్

అనకాపల్లి టౌన్/ కశింకోట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన కారణంగా జాతీయ రహదారిపై పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసుల ఆదేశాలు, సూచనలను వైసీపీ కార్యకర్తలు బేఖాతరు చేస్తూ, రహదారిపై గుంపులు గుంపులుగా చేరారు. కొందరు కార్యకర్తలు 'రప్పా రప్పా' అంటూ ముద్రించిన ఫ్లెక్సీలతో హల్‌చల్ చేశారు.

- 'రప్పా రప్పా' అని ముద్రించిన ఫ్లెక్సీలు ప్రదర్శన
- ద్విచక్ర వాహనాలపై దూసుకుపోతూ అవే నినాదాలు
- జగన్ వచ్చిన సమయంలో భారీ వర్షం.. చెల్లాచెదురైన కార్యకర్తలు
- జగన్ పర్యటనతో ట్రాఫిక్‌కు అంతరాయం



అనకాపల్లి కొత్తూరు వద్ద జాతీయ రహదారిపై వైసీపీ శ్రేణులు

మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలను సందర్శించేందుకు వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి గురువారం ఉదయం విశాఖ విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో కాన్వాయ్‌తో బయలుదేరారు. ఆయనకు ఘనస్వాగతం చెప్పడానికి కార్యకర్తలు పెద్ద ఎత్తున అనకాపల్లి కొత్తూరు జంక్షన్‌కు చేరుకోవాలన్న పార్టీ నాయకుల పిలుపుతో అనకాపల్లి, చోడవరం, మాడుగుల, ఎలమంచిలి నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. తొలుత రోడ్డు పక్కన నిల్చున్న వీరు క్రమేపీ రోడ్డుపైకి రావడం మొదలుపెట్టారు. పోలీసులు వారించినా పట్టించుకోలేదు. దీంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. దీంతో పోలీసులు విశాఖ వైపు నుంచి వచ్చే భారీ వాహనాలను పూడిమడక హైవే జంక్షన్ నుంచి మునగపాక, అచ్యుతాపురం జంక్షన్ మీదుగా ఎలమంచిలి హైవేకు మళ్లించారు. చిన్నపాటి వాహనాలు, బస్సులు, అత్యవసర వాహనాలను మాత్రమే జాతీయ రహదారిపై అనుమతించారు. వైసీపీ కార్యకర్తలు రోడ్డు మొత్తం ఆక్రమించడంతో వాహనాలు నెమ్మదిగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. జగన్ కొత్తూరు జంక్షన్‌కు వచ్చేసరికి వర్షం మొదలైంది. దీంతో పలువురు కార్యకర్తలు దుకాణాల వైపు, వంతెన కిందకు పరుగులు తీశారు. జగన్ వర్షంలో తడుస్తూనే ... మిగతా 8వ పేజీలో

వైసీపీకి ఎదురుదెబ్బ

నర్సీపట్నం మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్, మాజీ వైస్‌చైర్మన్ టీడీపీలో చేరిక

- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన చింతకాయల విజయ్



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్. చిత్రంలో తెలుగుదేశం పార్టీలో చేరిన మాజీ వైస్‌చైర్మన్ నరసింహమూర్తి, మాజీ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, టీడీపీ కౌన్సిలర్ పద్మావతి.

నర్సీపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నర్సీపట్నం నియోజకవర్గంలో పర్యటన రోజే ఆ పార్టీకి ఎదురు దెబ్బ తగిలింది. మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, ఆమె సోదరుడు నాగేశ్వరరావు, వైస్ చైర్మన్ గొలుసు నరసింహమూర్తి, పలువురు కార్యకర్తలు గురువారం ఇక్కడ తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీ నాయుడు, చోడవరం ఎమ్మెల్యే రాజు, టీడీపీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి.. వీరికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాలుగున్నరేళ్ల క్రితం జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో ఆదిలక్ష్మి 17వ వార్డు నుంచి, నరసింహమూర్తి 5వ వార్డు నుంచి వైసీపీ తరఫున కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. తరువాత ఆదిలక్ష్మిని చైర్‌పర్సన్‌గా, నరసింహమూర్తిని వైస్‌చైర్మన్‌గా ఎన్నుకున్నారు. పార్టీ పెద్దల సమక్షంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్ల పదవీ కాలం పూర్తయిన తరువాత వీరు తమ పదవులకు రాజీనామా చేయాల్సి వచ్చింది. అప్పటి నుంచి వైసీపీతో అంటీముట్టనట్టుగా వుంటున్నారు. వాస్తవంగా 17వ వార్డు కౌన్సిలర్ ఆదిలక్ష్మి అయినప్పటికీ, రాజకీయంగా చక్ర తిప్పేది మాత్రం ఆమె సోదరుడు నాగేశ్వరరావు. గత ఎన్నికల్లో ఈ వార్డును ఎస్సీ జనరల్‌కు కేటాయించినప్పటికీ మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని ఎస్సీ మహిళకు రిజర్వు చేశారు. దీంతో చైర్‌పర్సన్ పదవి కోసం నాగేశ్వరరావు కౌన్సిలర్‌గా పోటీ చేయకుండా తన సోదరి ఆదిలక్ష్మిని పోటీ చేయించారు. ఎన్నికల అనంతరం ఆమెను చైర్‌పర్సన్ చేయడంలో కీలకపాత్ర పోషించారు. కాగా వైసీపీకి చెందిన 18వ వార్డు కౌన్సిలర్ శెట్టి విజయాంబ, ఆమె భర్త శెట్టి మోహన్ గత ఏడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీలో చేరారు. కౌన్సిల్‌లో టీడీపీ బలం 15కి పెరగ్గా, వైసీపీ బలం 11కి తగ్గిపోయింది.

రోజూ వర్షమే!

పలు మండలాల్లో కుండపోతగా వాన

- కాలువల్లా మారిన రహదారులు

జిల్లాలో అనకాపల్లి పట్టణంతోపాటు పలు మండలాల్లో గురువారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అనకాపల్లిలో వరుసగా రెండో రోజు కూడా కుండపోతగా వర్షం పడడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కశింకోట, నక్కపల్లి, పరవాడ, గొలుగొండ, మాడుగుల, తదితర మండలాల్లో వర్షం కురిసింది.



అనకాపల్లిలో కురుస్తున్న వర్షం


అనకాపల్లి టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):

జిల్లా కేంద్రంలో గురువారం భారీ వర్షం కురిసింది. గత రెండు రోజులుగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ అధికంగా కాసి, తరువాత భారీ వర్షం కురుస్తున్నది. గురువారం మధ్యాహ్నం రెండు గంటల తర్వాత కుండపోతగా వర్షం పడడంతో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సులు ఆగే ప్లాట్‌ఫారం చుట్టూ భారీగా నీరు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వాహనాలను నాయుళ్లవీధి, లక్ష్మీదేవిపేట రైల్వేగేటు మీదుగా మళ్లించడంతో ట్రాఫిక్ సమస్య ... మిగతా 8వ పేజీలో

కల్యాణపులోవకు పెరిగిన వరద

రావికమతం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని కల్యాణపులోవ జలాశయానికి వరద ప్రవాహం గురువారం కూడా కొనసాగింది. గరిష్ఠ నీటిమట్టం 460 అడుగులు కాగా, పరీవాహక ప్రాంతమైన ఏజెన్సీలో కురుస్తున్న భారీ వర్షాలతో 380 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. దీంతో గురువారం నీటి మట్టం 459.02 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యగా స్పిల్‌వేలో మూడు గేట్లు ఎత్తి 350 క్యూసెక్కుల నీటిని సర్పా నదిలోకి విడిచిపెడుతున్నారు. నదికి ఇరువైపులా వున్న రా



కల్యాణపులోవ రిజర్వాయర్ నుంచి సర్పా నదిలోకి విడుదలవుతున్న నీరు

వికమతం, రోలుగుంట, మాకవరపాలెం మండలాల్లోని చీమలపాడు, జడ్.కొత్తపట్నం, గంపవానిపాలెం, కొత్తకోట, కన్నంపేట, జగ్గంపేట, జె.నాయుడుపాలెం, కొమరవోలు, ఆర్.కొత్తూరు, కుసర్లపూడి, తూటిపాల, తాడపాల, కొండల అగ్రహారం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఈ డి.సూర్య కోరారు.

షుగర్స్ మహాజన సభ వాయిదా

పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు

చోడవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):

గోవాడ సహకార చక్కెర కర్మాగారం మహాజన సభను ఆరు నెలలపాటు వాయిదా వేస్తూ రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర షుగర్ కేన్ కమిషనర్‌తోపాటు, గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఎండీ విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. వాస్తవానికి ఏటా సెప్టెంబరు నెలాఖరులోగా ఫ్యాక్టరీ మహాజన సభను నిర్వహిస్తుంటారు. అయితే గత ఏడాది ఫ్యాక్టరీకి సరఫరా అయిన చెరకుతోపాటు 2023-24 సీజన్‌కు సంబంధించి కొంత బకాయిలు కలిపి రైతులకు సుమారు రూ.29 కోట్లు చెల్లించవలసి ఉంది. ఇంకా కార్మికులకు వేతనాలు, రిటైరయిన కార్మికులకు గ్రాట్యుటీ బకాయిలు మరో రూ.7 కోట్లు వుంటాయి. ప్రభుత్వం నిధులు ఇస్తే తప్ప బకాయిలు చెల్లించే పరిస్థితి లేదు. బకాయిల వివరాలతోపాటు, ఈ సీజన్‌లో ఫ్యాక్టరీని నడిపించేందుకు మరో రూ.10 కోట్లు అవసరమంటూ అధికారులు కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపించారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. ఈ నేపథ్యంలో మహాజన సభ నిర్వహణను ఆరు నెలలపాటు వాయిదా వేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌కు బదిలీ

విశ్వనాథన్‌ను ఐ అండ్ పీఆర్ డైరెక్టర్‌గా నియమించిన ప్రభుత్వం

- విశాఖ కలెక్టర్‌కు వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు



విశ్వనాథన్

విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌కు విజయవాడ బదిలీ అయింది. రాష్ట్ర ప్రభుత్వం గురువారం పలువురు ఐఏఎస్‌లను బదిలీ చేసింది. ఇందులో భాగంగా విశ్వనాథన్‌ను ఇన్‌ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ శాఖ డైరెక్టర్‌గా నియమించింది. దీంతో పాటు సాధారణ పరిపాలన ఎక్స్ అఫీషియో డిప్యూటీ సెక్రటరీ బాధ్యతలను కూడా అప్పగించింది. విశ్వనాథన్ మూడేళ్ల క్రితం జాయింట్ కలెక్టర్‌గా విశాఖపట్నంలో బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత జీవీఎంసీలో అదనపు కమిషనర్‌గా కొన్ని నెలలు పనిచేశారు. ఏడాదిన్నర క్రితం వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా నియమితులయ్యారు. పనిచేసిన ప్రతి చోటా తనదైన ముద్ర వేశారు.

నిజాయితీ గల అధికారిగా...

విశ్వనాథన్ నిజాయితీ గల అధికారిగా గుర్తింపు పొందారు. వీఎంఆర్‌డీఏలో ప్రాజెక్టులను పరుగులు పెట్టించారు. సిరిపురంలో 'ది డెక్' నిర్మాణం పూర్తిచేయడంతో పాటు దానిని ప్రముఖ సంస్థలకు అప్పగించడంలో కీలకంగా వ్యవహరించారు. కైలాసగిరిపై జిప్‌లైనర్, స్కై సైక్లింగ్‌తో పాటు గ్లాస్ బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకువచ్చారు. భోగాపురం విమానాశ్రయాన్ని కలుపుతూ మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను పట్టాలెక్కించారు. ఇక జీవీఎంసీలో ఉండగా చెరువుల ఆక్రమణలపై దృష్టి సారించి, పాడైన చెరువుల పునరుద్ధరణకు ప్రత్యేక ప్రాజెక్టును చేపట్టారు. సుమారు ఐదు చెరువులను పునర్నిర్మించి, వాటికి నిత్యం నీరందే ఏర్పాట్లు చేశారు. విశాఖ- భీమిలి మార్గంలో పలు చోట్ల తీర ప్రాంతం కోతకు గురవుతున్న నేపథ్యంలో పరిరక్షణకు కేంద్రం విశాఖ ఎంపీ సాయంతో ఇటీవల రూ.220 కోట్ల నిధులు సాధించారు. విశాఖలో మధ్య తరగతి ప్రజల కోసం ... మిగతా 8వ పేజీలో

రిచా ఘోష్ మెరుపు ఇన్నింగ్స్



బ్యాటింగ్ చేస్తున్న రిచా ఘోష్

బ్యాటుతో ఆకట్టుకున్న భారత వికెట్ కీపర్

- అయినా దక్కని విజయం
- ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా గెలుపు
- వీరోచిత బ్యాటింగ్‌తో అదరగొట్టిన డీ క్లెర్క్

విశాఖపట్నం, స్పోర్ట్స్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):

భారత వికెట్ కీపర్ రిచా ఘోష్, దక్షిణాఫ్రికా బ్యాటర్ డీ క్లెర్క్ బ్యాటింగ్ మెరుపులతో ఏసీఏ-వీడీసీఏ స్టేడియం హోరెత్తింది. వన్డే మ్యాచ్ కాస్త టీ20 మాదిరిగా సాగింది. అయితే ఆతిథ్య జట్టు ఓటమి పాలుకావడం అభిమానులను నిరాశకు గురిచేసింది.

మహిళల వన్డే ప్రపంచ కప్ టోర్నీలో భాగంగా గురువారం దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ మూడు వికెట్ల తేడాతో ఓటమి చెందింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 49.5 ఓవర్లలో 251 పరుగులు చేసింది. ఓపెనర్లు ... మిగతా 8వ పేజీలో



డీ క్లెర్క్ (దక్షిణాఫ్రికా) 84 నాటౌట్

అధ్వాన రహదారితో అవస్థలు

తీవ్ర ఇబ్బందులు పడుతున్న పలు గ్రామాల ప్రజలు

రూ.80 లక్షలు మంజూరైనా ప్రారంభం కాని పనులు





పెద స్వయంభూవరం సమీపంలో దెబ్బతిన్న రహదారి. (ఇన్‌సెట్‌లో) సోమునాయుడుపాలెం వద్ద రాళ్లు తేలిన రోడ్డు

ఇది మండలంలో రావాడ పంచాయతీ సోమునాయుడుపాలెం నుంచి కలపాక పంచాయతీ స్వయంభూవరం వరకు వున్న రహదారి. పలుచోట్ల రాళ్లు తేలి, గోతులతో దారుణంగా తయారైంది. భారీ వర్షం కురిస్తే గెడ్డ ద్వారా వచ్చే నీరు రోడ్డు మీదుగా పారుతుండడంతో కోతకు గురవుతున్నది. గోతుల రాత్రిపూట ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇరువైపులా డ్రైనేజీ కాలువలకు, రోడ్డుకు మధ్యలో గట్టులా మట్టి పేరుకుపోవడంతో వర్షం కురిస్తే నీరంతా రహదారిపై నిలిచిపోతున్నది. ఈ రోడ్డు దుస్థితిని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మూడు నెలల క్రితం నాబార్డు నిధులు రూ.80 లక్షలు మంజూరయ్యాయి. కానీ ఇంతవరకు పనులు ప్రారంభించలేదు. దీనిపై పీఆర్ (ప్రాజెక్టులు) ఈఈ రాజ్‌కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. గత నెలలోనే టెండర్ల ప్రక్రియ పూర్తయ్యిందని, వర్షాల కారణంగా కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టలేదని చెప్పారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన పనులు మొదలవుతాయన్నారు. -పరవాడ/ఆంధ్రజ్యోతి

పాటిపల్లిలో అభివృద్ధి పనులకు శ్రీకారం



పాటిపల్లిలో ఇంటింటి కొళాయి పనులకు భూమిపూజ చేసిన సర్పంచ్ ఆడారి కృష్ణవేణి

మునగపాక, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో పాటిపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు పంచాయతీ పాలకవర్గం శ్రీకారం చుట్టింది. దానిలో భాగంగా గ్రామంలో ఇంటింటి కొళాయిలు ఏర్పాటు పనులకు, అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ భవనం నిర్మాణానికి గురువారం భూమిపూజ చేసినట్టు సర్పంచ్ ఆడారి కృష్ణవేణి తెలిపారు. పనులు త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆడారి త్రిమూర్తులు, భీశెట్టి ధనశ్రీనివాసరావు, వార్డు సభ్యులు ఆడారి రామకృష్ణ, యల్లపు వెంకట్, గనిరెడ్డి గోవింద తదితరులు పాల్గొన్నారు.

దుప్పితూరులో ఉచిత పశువైద్య శిబిరం

అచ్యుతాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుప్పితూరులో గురువారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 105 ఆవులు, 50 గేదెలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ ఏడీ టి.శ్రీనివాస రావు, పశువైద్యాధికారిణి ఉమామహేశ్వరి, ప్రగడ జూనియర్ నాగేశ్వరరావు, రాజ్‌కుమార్, మాధురి పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం



ఉప్పవరం గ్రామంలో రోడ్డు పైనుంచి పారుతున్న కొండగెడ్డ

అచ్యుతాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పవరం, మల్లవరం, ఎర్రవరం ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం పడింది. దీంతో కొండ గెడ్డలు పొంగి ప్రవహించాయి. ఉప్పవరం కొండగెడ్డ ఆక్రమణలకు గురవడంతో నీరు గ్రామంలోని సచివాలయం మీదుగా పారింది. కొండకర్ల జంక్షన్ నుంచి ఉప్పవరం మీదుగా ఎంజేపురం వెళ్లే రహదారి గుండా కొండగెడ్డ నీరు ప్రవహించింది. దీంతో వాహన రాకపోకలకు కొంతసేపు ఇబ్బంది కలిగింది. గంట తర్వాత ఉధృతి తగ్గడంతో రాకపోకలు సజావుగా సాగాయి.

గ్రామాల్లో పర్యటించిన అధికారులు



కాగిత గ్రామంలో ఉపాధి కూలీలకు జీఎస్‌టీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నక్కపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు, కాగిత గ్రామాల్లో గురువారం ఎంపీడీవో డి.సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో కె.చలపతిరావు పర్యటించారు. ఈ రెండు గ్రామాల్లో చెరువు పనులు చేపడుతున్న ఉపాధి కూలీలతో సమావేశాలు నిర్వహించారు. సూపర్ జీఎస్‌టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పొదుపు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ రెండు గ్రామాల్లో శానిటేషన్ పనులను పరిశీలించారు. వేంపాడు గ్రామంలో సంపద కేంద్రాన్ని తనిఖీ చేసి సేంద్రియ ఎరువుల ఉత్పత్తులను పెంచాలని సూచించారు. కాగిత గ్రామంలో హెల్త్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు, గ్రామ పెద్దలు, సెక్రటరీలు పాల్గొన్నారు.

ఘనంగా జంపపాలెం మరిడిమాంబ జాతర

ఎలమంచిలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపపాలెంలో గురువారం మరిడిమాంబ జాతరను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక కంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి చెడుగుడు పోటీలు నిర్వహిస్తున్నరు. ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొంటున్నాయి. రాత్రికి విజేతలు తేలనున్నారని నిర్వాహకులు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

పాయకరావుపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పనుల నిర్వహణలో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. పాయకరావుపేటలోని రాజుగారిబీడు, కొత్తకాలనీ, కరణంగారివీధి, నూకాలమ్మతోట, పెదిరెడ్డి సన్యాసిరావునగర్ కాలనీ, మండలంలోని పీఎల్.పురంలోని వ్యవసాయ బోర్లుకు, సత్యవరం, గోపాలపట్నం, పెంటకోట, పెద్దిరాజుపాలెం, ఈదటం, కందిపూడి గ్రామాల్లో అంతరాయం ఏర్పడనుందన్నారు. అదేవిధంగా ఉదయం 10 నుంచి 11 గంటల వరకు పాల్మన్‌పేట, కొర్లయ్యపేట, రాజయ్యపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

'కందిపూడిలో శాఖా గ్రంథాలయాన్ని పునరుద్ధరించాలి'



శిథిల స్థితికి చేరిన గ్రంథాలయ భవనంలో పాడైపోయిన పుస్తకాలు

పాయియకరావుపేట రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందిపూడి శాఖా గ్రంథాలయాన్ని పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో 1995వ సంవత్సరంలో కొణతాల రామకృష్ణ ఎంపీ నిధులతో గ్రంథాలయ భవనాన్ని నిర్మించారు. కొన్ని సంవత్సరాలు పాటు గ్రంథాలయాన్ని నడపడంతో గ్రామంలోని యువకులు, విద్యార్థులు, పెద్దలు పుస్తక పఠనం చేసేవారు. తర్వాత గ్రంథాలయాన్ని మూసి వేశారని గ్రామస్థులు తెలిపారు. అధికారులు గ్రంథాలయాన్ని పట్టించుకోకుండా వదిలేయడంతో భవనం శిథిల స్థితికి చేరుకోవడమే కాకుండా విలువైన పుస్తకాలకు చెదలు పట్టి పాడైపోయాయని గ్రామానికి చెందిన పందిరి అప్పారావు రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. అధికారులు స్పందించి గ్రామంలో చిన్న గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జీఎస్‌టీ ఫలాలు ఇంటింటికి చేరువ కావాలి

» మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాయకులు



రాంబిల్లిలో జీఎస్‌టీపై అవగాహన కల్పిస్తున్న నేతలు పప్పల చలపతిరావు, రంగనాయకులు, భరత్



ఎలమంచిలి సీహెచ్‌సీ ఆవరణలో సూపర్ జీఎస్టీ కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్, వైద్యులు, కమిటీ ప్రతినిధులు

రాంబిల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్‌టీ ఫలాలు ఇంటింటికి చేరువ చేయాలన్నదే కూటమి ప్రభుత్వం ధ్యేయమని టీడీపీ మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు దుకాణాల వద్దకు వారు వెళ్లి సూపర్ జీఎస్‌టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్‌టీ సంస్కరణలతో రైతులు, మహిళలు, యువత, పేద, మధ్య తరగతి ప్రజలు, వ్యాపారులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు లాలం భరత్, పప్పల నూకన్నదొర, రాంబిల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఎరిపల్లి చిట్టిబాబు, టీడీపీ నాయకులు కరెడ్ల ఈశ్వరరావు, ఎరిపల్లి అజయ్, ధర్మాల ఆదిరెడ్డి, ఎలమంచిలి ఏఎంసీ డైరెక్టర్ గోవింద్, నాయకులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని సీహెచ్‌సీ ఆవరణలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం హయాంలో పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రజారంజక పాలన అందించడమే ధ్యేయంగా ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు విశేషమైన కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు నిహారిక, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధులు గుర్రాల శేఖర్, పిట్టా దాసుబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, జనసేన నేతలు బొద్దపు శ్రీను, లవుడు లోవరాజు, కొఠారు శ్రీను, పూటకూటి రమేష్, చిట్టిబాబు, కర్రి యూస్సీ పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సూపర్ జీఎస్టీ ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. సామాజిక కార్యకర్త జీవీవీ.సత్యనారాయణ, జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎంఆర్.ప్రసన్నకుమార్ తదితరులు మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ అమలుతో నిత్యావసర సరుకులు, మందుల ధరలు తగ్గాయన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం పి.జాన్‌ప్రసాద్, ఉపాధ్యాయులు, పీహెచ్‌సీ ఎంపీహెచ్ఓ డి.నెహ్రూ, సూపర్‌వైజర్ ఎం.నాగేశ్వరరావు, ఏఎన్ఎం రమణమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మునగపాకలో..

జీఎస్టీలో మార్పులతో మందుల ధరలు తగ్గుముఖం పట్టాయని స్థానిక పీహెచ్‌సీ సీహెచ్‌వో ఆర్.దేవకాంత తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ, పంచాయతీ వద్ద గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆమె మాట్లాడుతూ సర్జికల్ పరికరాలు కూడా ధరలు తగ్గాయని తెలిపారు. కొనేముందు తేడాలను గ్రహించాలని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో డాక్టర్ ఎం.నాగలక్ష్మి, కూటమి నాయకులు దాడి ముసిలినాయుడు, విల్లూరి నూకనర్సింగరావు, దాడి శివ, లక్ష్మణరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

బాంబు బ్లాస్టింగ్‌లతో నష్టపోతున్నాం

దుర్గానగర్ వాసుల ఆందోళన



సీపీఐ మండల కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న దుర్గానగర్ ప్రజలు

పాయకరావుపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పోలవరం ఎడమ కాలువ నిర్మాణంలో భాగంగా కొండను పగులగొట్టేందుకు కాంట్రాక్టర్ నిర్వహిస్తున్న బాంబు బ్లాస్టింగ్‌లతో తమ ఇళ్లకు నష్టం జరుగుతోందని, తమకు అండగా ఉండాలని దుర్గానగర్‌కి చెందిన పలువురు గురువారం సీపీఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావుకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బి.దుర్గ, దుర్గాసాయిప్రసాద్, మామిడి మంగ తదితరులు మాట్లాడుతూ స్థానిక దుర్గానగర్‌లో మూడు దశాబ్దాలుగా ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నామన్నారు. కాలనీకి సమీపంలో పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ కొండను తొలగించేందుకు బాంబు బ్లాస్టింగ్ చేస్తుండడంతో తమ ఇళ్లు ధ్వంసం అవుతున్నాయని వాపోయారు. తీవ్రంగా నష్టపోతున్న తమకు సీపీఐ అండగా ఉండి నష్ట నివారణకు కృషిచేయాలని కోరుతున్నారు. కార్యక్రమంలో ఎం.సత్తిబాబు, పి.అమ్మాజీ, ఎ.లోవరత్నం, ఎ.తేజేష్, వి.దేవి, వి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

కంపుకొడుతున్న పైడమ్మ చెరువు

» వాడనర్సాపురం గ్రామస్థులు ఉక్కిరిబిక్కిరి

» పేరుకుపోయిన చెత్త, చెదారం

» గ్రామంలో దోమలు స్వైరవిహారం



పైడమ్మ చెరువు వద్ద పేరుకుపోయిన చెత్త

రాంబిల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మత్స్యకార గ్రామమైన వాడనర్సాపురం పైడమ్మ చెరువు కంపుకొడుతోంది. ఈ చెరువు వద్దే చెత్త, చెదారం వేస్తుండడంతో వర్షాలకు కుళ్లి దుర్వాసన వస్తోంది. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాన్ని ఆనుకొని ఉన్న పైడమ్మ చెరువు 100 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువులో నిత్యం నీరు ఉంటుంది. స్థానికులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన పశువులకు ఈ చెరువు ఎంతో ఉపయోగపడుతుంది. గ్రామానికి డ్రైనేజీ వ్యవస్థ పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఇళ్లలోని వాడుక నీరు నేరుగా ఈ చెరువులోకి వెళుతున్నది. అంతే కాకుండా గ్రామాన్ని ఆనుకొని ఏర్పాటైన ఎన్ఏఓబీలోని కూలీలు ఉంటున్న క్యాంపస్‌లోని వృధా నీటిని కూడా ఈ చెరువులోకి వదిలేస్తున్నారు. దీంతో చెరువులోని నీరు దుర్వాసన వెదజల్లుతుందని, దోమల తీవ్రత పెరిగిపోవడంతో రోగాల బారిన పడుతున్నామని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇళ్లలోని చెత్తను కూడా చెరువు వద్ద వేస్తున్నారని, రోజు,రోజుకు చెరువు వద్ద చెత్త పేరుకుపోతుండడంతో పందుల ఆవాసంగా మారిందని వారంటున్నారు. పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఉపాధి కూలీలకు రెండు పూటలా ఫొటోలు తీయాలి

» ఎంపీడీవో చంద్రశేఖర్



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు ఈకేవైసీ తప్పనిసరని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలో బీకేపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులకు సంబంధించి మస్తర్లలో నమోదు చేసిన కూలీలకు పనిచేసే చోట రెండు పూటలా ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో పొందుపరిచాలని సూచించారు. ఉదయం పనికి రాగానే ఒక సారి సాయంత్రం నాలుగు గంటల తరువాత మరోసారి ఫొటోలు తీసి, వాటిని యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఉపాధి కూలీలకు వేతన చెల్లింపుల ఫొటోలు తప్పనిసరి అని అన్నారు. ఫొటోలు తీసుకోకపోతే వేతనాలు మంజూరుకావని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు, పంచాయతీ కార్యదర్శి రఘురామ్, తదితరులు పాల్గొన్నారు.

దంత సమస్యలను తేలిగ్గా తీసుకోకూడదు

సర్పంచ్ అప్పారావు

మునగపాక, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చాలా మంది దంత సమస్యను నిర్లక్ష్యం చేస్తారని, అది మంచి పద్ధతి కాదని సర్పంచ్ దిమ్మల అప్పారావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఏషియన్ పెయింట్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని ప్రారంభించిన అప్పారావు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను అవసరమైన వారు వినియోగించుకోవాలన్నారు. దంతాల పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. దంతాలు బాగుంటేనే తిన్న ఆహారం సులువుగా జీర్ణం అవుతుందన్నారు. శిబిరంలో రోగులకు దంత వైద్యులు సుధీర్, విజయకుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు.

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

స్టాక్, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబరు కాంతారావు

నెహ్రూనగర్ అంగన్‌వాడీ కార్యకర్తకు మెమో

రైల్వే స్టేషన్ రోడ్డులోని డీలర్‌కు హెచ్చరిక

ఎలమంచిలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ డిపోలను గురువారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబరు బి. కాంతారావు వివిధ శాఖల అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. నెహ్రూనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రానికి రానివారికి ఎందుకు ఆఫ్‌సెంట్ వేయలేదని అంగన్‌వాడీ కార్యకర్తను ప్రశ్నించారు. అందరికీ ప్రజెంట్ వేసి రానివారికి ఆఫ్‌సెంట్ వేయకుంటే ఎలా అని ప్రశ్నించారు. ఇలా అయితే గుడ్లు పంపిణీలో వ్యత్యాసం వచ్చే అవకాశం ఉందని అంటూ అంగన్‌వాడీ కార్యకర్తకు మెమో జారీ చేయాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. రైల్వే స్టేషన్ రోడ్డులోని రేషన్ డిపోను పరిశీలించారు. త్రిమూర్తులు స్వామి ప్రాంతంలోని రేషన్ డిపోను సందర్శించి డిపోలో అపరిశుభ్ర వాతావరణం ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న బియ్యం బస్తాలు ఉండడాన్ని గమనించారు.

ఈవిధంగా ఉండ కూడదని హెచ్చరించి, మొదటి తప్పుగా విడిచిపెడుతున్నానని, మరోసారి పునరావృతం కాకుండా చూసుకోవాలని డీలరును హెచ్చరించారు. అనంతరం కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాల, తులసీనగర్‌లోని బాలికోన్నత పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. తులసీనగర్ స్కూల్‌లో బియ్యం స్టాకును తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు అందించారు. ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ నాణ్యమైన బియ్యాన్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో అప్పారావు, ఐసీడీఎస్ పీడీ ఎన్. సూర్యలక్ష్మి, స్థానిక పీవో కె. ఇందిర, సివిల్ సప్లయ్స్ ఏపీవో మూర్తి, ఎంఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నియంత్రణ అందరి బాధ్యత

రేలుగుంట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు నివారణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సెక్టారు సూపర్‌వైజర్ హైమావతి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొవ్వూరు, రేలుగుంట, కొమరవోలు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఇంటర్నేషనల్ డే ఆఫ్ గర్ల్ చైల్డ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం అభివృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలలను సాకారం చేసుకునే దూరం చేస్తుందన్నారు.

త్వరలో అన్న క్యాంటీన్ ప్రారంభం

» టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్



పాయకరావుపేటలో అన్న క్యాంటీన్ పనులను పరిశీలిస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

పాయకరావుపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలో అన్న క్యాంటీన్ త్వరలో ప్రారంభం కానుందని టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్ తెలిపారు. పట్టణంలోని అరటి గెలల మార్కెట్‌లో నిర్మాణంలో ఉన్న అన్న క్యాంటీన్ చివరి దశ పనులను డిప్యూటీ ఎంపీడీఓ కె.డేవిడ్, ఇంజనీరింగ్ అధికారులు స్వాతి తదితరులతోపాటు పలువురు టీడీపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ పేదలకు 5 రూపాయలకే రుచికరమైన భోజనం, అల్పాహారం అందుబాటులోకి రానుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, పట్టణ మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, పాయకరావుపేట పీఏసీఎస్ చైర్‌పర్సన్ దేవవరపు రాజబాబు, నాయకులు మలిపెద్ది వెంకటరమణ, జూరెడ్డి ప్రసాద్, గొల్లపల్లి నాగు, వేములపూడి అప్పారావు, రాజాన ఆది, చిలుకూరి పేర్రాజు, ముంజులూరి దుర్గాప్రసాద్, బంగారు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరుపై ప్రగడ హర్షం

ఎలమంచిలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రహదారుల మరమ్మతుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెయ్యి కోట్ల రూపాయలు మంజూరు చేయడం గొప్ప విషయమని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం అమరావతి సచివాలయంలో రోడ్లు, భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావుల సమక్షంలో అధికారులతో సమావేశం నిర్వహించామన్నారు. గుంతలు లేని రహదారుల నిర్మాణమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని సూచించారు. రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటించి ప్రజలకు ఉపయోగపడేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో రోడ్ల మరమ్మతులకు వెయ్యి కోట్ల రూపాయలు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

డొంకాడను ముంచెత్తిన వరద



డొంకాడలో వరద నీటికి అడ్డంగా ఉన్న చెత్తను తొలగిస్తున్న గ్రామస్థులు

నక్కపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డొంకాడ గ్రామాన్ని గురువారం సాయంత్రం వరద నీరు పోటెత్తింది. గురువారం సాయంత్రం డొంకాడ పరిసర మెరక గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి కొండలు,వాగుల నుంచి పెద్ద ఎత్తున నీరు ప్రవహించి కాలువల ద్వారా డొంకాడ గ్రామానికి చేరుకుంది. ఈ కారణంగా డొంకాడ గ్రామంలో వున్న పలు కాలువలు, వీధుల్లో వరద నీరు ప్రవహించింది. ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. వర్షపు నీరు పోయేందుకు సరైన మార్గం లేకపోవడంతో పెద్ద వర్షాలు కురిసినప్పుడు కొండ వాగుల నుంచి నీరు తమ కాలనీల్లోకి వస్తోందని డొంకాడ గ్రామస్థులు ఆవేదన వెలిబుచ్చారు.

తడి, పొడి చెత్తలను వేరు చేసి ఇవ్వాలి

» ఎంపీడీవో చంద్రశేఖర్



జల్లూరులో చెత్త సేకరణ చేయిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తతను గ్రామస్థులు వేర్వేరుగా చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని జల్లూరు, బీకేపల్లి గ్రామాల్లో శానిటేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరు చేసే విధానంపై గ్రామస్థులకు అవగాహన కల్పించాలన్నారు. సంపద కేంద్రం వద్ద చెత్త వర్మీకంపోస్టుగా మార్చి విక్రయించి, పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, పంచాయతీ కార్యదర్శి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ విద్యార్థులకు క్రీడా దుస్తులు వితరణ



దుస్తులతో క్రీడాకారులు

ఎలమంచిలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలోని క్రీడాకారులకు గురువారం దుస్తులు వితరణగా అందజేశారు. త్వరలో జరగనున్న స్కూలు గేమ్స్‌లో పాల్గొనే క్రీడాకారులకు వ్యాయామ ఉపాధ్యాయుడు రాజు సొంత నిధులతో కొనుగోలు చేసిన దుస్తులను హెచ్ఎం రమణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగన్ దృష్టికి మత్స్యకారుల సమస్యలు



జగన్‌తో మాట్లాడుతున్న వీసం రామకృష్ణ

నక్కపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న ఆందోళన, మత్స్యకారులకు జరిగే నష్టం, ఇతర సమస్యల గురించి మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి వైసీపీ నేత వీసం రామకృష్ణ వివరించారు. గురువారం నర్సీపట్నం నియోజకవర్గంలో పర్యటించిన జగన్‌ను రోడ్ షోలో భాగంగా నక్కపల్లి వైసీపీ నేత వీసం రామకృష్ణ మత్స్యకారుల సమస్యలపై జగన్‌కు వివరించారు. బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు.

హిందూ మత పరిరక్షణకు కృషి: ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రముఖ్

బుచ్చెయ్యపేట అక్టోబరు 9 (ఆంధ్ర జ్యోతి): మండలంలో హిందూ మత సంరక్షణకు ఆర్ఎస్ఎస్ ఎంతగానో కృషి చేస్తోందని జిల్లా ప్రముఖ్ గర్రెడ్డి జగదీశ్వరరావు అన్నారు. స్థానిక విజయ దుర్గాదేవి ఆలయంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను గురువారం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ జిల్లా సాంస్కృతిక ప్రముఖ్ వరహ నాగేశ్వరరావు, పూడి రామారావు, సుంకరి సత్యారావు , బి. మణికంఠ, గోపిశెట్టి శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అడుగుకో మడుగు

▸▸ దారుణంగా రావలమ్మపాలెం- గుల్లేపల్లి రహదారి ▸▸ నల్లరేగులపాలెం- నారపాడు జంక్షన్‌కు వెళ్లే మార్గానిదీ ఇదే దుస్థితి

▸▸ గత ఐదేళ్లలో కన్నెత్తి చూడని వైసీపీ ప్రభుత్వం ▸▸ కూటమి వచ్చాక పలు చోట్ల మరమ్మతులు చేపట్టినా.. నిధులు చాలక కొన్నిచోట్ల నిలిచిన పనులు


గొటివాడ- అంతకాపల్లి మార్గంలో...


రావలమ్మపాలెం నుంచి గుల్లేపల్లి వెళ్లే రోడ్డు దుస్థితి


నల్లరేగులపాలెం నుంచి నారపాడు జంక్షన్‌కు వెళ్లే రోడ్డులో...

సబ్బవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు రహదారులు అధ్వానంగా మారాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వీటి అభివృద్ధికి ఎటువంటి నిధులు మంజూరు చేయపోవడంతో ఎక్కడికక్కడ గుంతలు పడి ప్రయాణికులకు దడ పుట్టిస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక పలుచోట్ల రహదారులను అభివృద్ధి చేసినప్పటికీ ఇక్కడున్న పలు రోడ్లపై దృష్టి సారించలేదని అంటున్నారు.

ముఖ్యంగా చోడవరం రోడ్డులో గల న్యాయ విశ్వవిద్యాలయం నుంచి గొటివాడ మీదగా అంతకాపల్లి, రావలమ్మపాలెం వెళ్లే రహదారి, రావలమ్మపాలెం నుంచి గుల్లేపల్లి రోడ్డు (పాతరోడ్డు- గుల్లేపల్లి)ను కలిపే రహదారి మరీ దారుణంగా ఉన్నాయి. సుమారు ఎనిమిది కిలో మీటర్ల మేర తారు రోడ్డు ఛిద్రమైంది. ఫలితంగా రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక వర్షాలు కురిస్తే ప్రత్యక్ష నరకమే చూడాల్సి వస్తోంది. గత కొద్ది రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు ఎక్కడికక్కడ నీరు చేరి నిలిచిపోయింది. దీంతో రోడ్డు ఎక్కడో, గుంత ఎక్కడో గుర్తించలేని పలువురు వాహనదారులు చిన్న చిన్న ప్రమాదాలకు గురవుతున్నారు. గడిచిన ఐదేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని ఆ పరిధిలోని గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాటి పాలకులు ఈ రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామని హామీలు గుప్పించినా ప్రకటనలకే పరిమితమైందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కూడా దృష్టి సారించడం లేదని అంటున్నారు. రాత్రి వేళలో ఇటుగా ప్రయాణం అంటేనే వాహనదారులు హడలిపోతున్నారు.

అదే విధంగా నల్లరేగులపాలెం నుంచి నారపాడు మీదుగా నారపాడు జంక్షన్‌కు వెళ్లే మార్గం పూర్తిగా ధ్వంసం కావడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా ఆయా పరిధిలోని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రూ.70 లక్షలతో ప్రతిపాదనలు

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక గొటివాడ నుంచి 1.3 కిలోమీటర్ల మేర రోడ్డుకు మరమ్మతులు చేపట్టాం. నిధులు చాలకపోవడంతో మిగతా పనులు నిలిచిపోయాయి. ఈ రోడ్డుపై కొత్తగా లేయర్ వేసేందుకు రూ.70 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. - బాలరాజు, జేఈ, ఆర్‌అండ్‌బీ, సబ్బవరం

ఉత్తరాంధ్రపై జగన్‌ది సవతి తల్లి ప్రేమ

▸▸ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల, చిత్రంలో డీసీసీబీ చైర్మన్

విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రపై వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారని, వైసీపీ హయాంలో విద్యాభివృద్ధిని గాలికి వదిలేశారని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. పట్టణంలోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ దేశంలోనే సీనియర్ ముఖ్యమంత్రి చంద్రబాబు అని పేర్కొన్నారు. ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని వివరించారు. తల్లికి వందనం, ప్రతినెలా పింఛన్లు, స్త్రీశక్తి పథకం విజవంతంగా అమలు చేస్తున్నట్టు గుర్తుచేశారు. వీటితో పాటు ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు ఇటీవల రూ.15 వేలను కానుకగా అందించినట్టు చెప్పారు. మెడికల్ కాలేజీలను పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) కింద మారుస్తున్నారని జగన్మోహన్‌రెడ్డి మొసలికన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో మెడికల్ కాలేజీల కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టిన పాపాన పోలేదన్నారు. 17 మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రభుత్వం అప్పగిస్తుంది అనడంలో ఏ మాత్రం నిజం లేదన్నారు. కేంద్రం ఏడు కాలేజీలకు సిఫార్సు చేస్తే ప్రస్తుతం నాలుగు కాలేజీలు మాత్రమే ఆమోదం పొందాయని తెలిపారు. అందులోనూ ప్రభుత్వ పథకాలను వర్తింపజేయడంతో పాటు ఆయా కళాశాలల్లోని సీట్లు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పీపీపీ పద్ధతిలో అంగీకరించిన తరువాత 33 ఏళ్ల అనంతరం ప్రభుత్వం వాటిని తిరిగి తీసుకుంటుందని చెప్పారు. వైసీపీ హయాంలో విద్యావ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారని మండిపడ్డారు. డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం ఎన్‌డీఏ ప్రభుత్వం కృషి చేస్తుంటే జగన్‌రెడ్డి అర్థంలేని రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, జనసేన ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి పసుపులేటి ఉషారాణి, ఫ్లోర్ లీడర్ వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'బొజ్జన్నకొండ అభివృద్ధిపై దృష్టి సారించాలి'


బొజ్జన్నకొండ విశిష్టత తెలిపే కరపత్రాలను ప్రదర్శిస్తున్న ప్రతినిధులు

తుమ్మపాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ బౌద్ధ క్షేత్రం బొజ్జన్నకొండ అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం కోరారు. గురువారం బొజ్జన్నకొండ వద్ద ఆ ప్రాంత విశిష్టత తెలిపే కరపత్రాలు, బౌద్ధ మేళా కరపత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొజ్జన్నకొండ వద్ద చేపట్టిన అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. నిత్యం పర్యాటకులు, బౌద్ధ సంఘాల ప్రతినిధులు, బౌద్ధ భిక్షువులతో కళకళలాడే బొజ్జన్నకొండ వద్ద మౌలిక సదుపాయాలను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా బౌద్ధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై దాడి అవమానం


అంబేడ్కర్ విగ్రహం వద్ద వామపక్ష నాయకులు, దళిత సంఘాల నిరసన

అనకాపల్లి టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయిపై న్యాయవాది బూటు విసరడాన్ని నిరసిస్తూ ఇక్కడి నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వామపక్షాలు, బీఎస్పీ, దళిత సంఘాల నేతలు గురువారం నిరసన తెలిపారు. అంబేడ్కర్ సేవా సంఘం నాయకుడు బూసిరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు జి.కోటేశ్వరరావు, వైఎస్ భద్రం మాట్లాడుతూ న్యాయమూర్తిపై దాడి చేయడం దారుణమన్నారు. ఇందుకు పాల్పడిన వారిపై రాజ్యద్రోహం కింద కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకుడు సూదికొండ మాణిక్యాలరావు, జైభీమ్ సేవా సంఘం నాయకులు రేబాక మధు, ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, కోరిబిల్లి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టు తప్పితే ప్రమాదమే!

▸▸ పలువురు వాహనదారుల నిర్లక్ష్యంతో రోడ్డుపై ప్రయాణించే వారిలో దడ

▸▸ పరిమితికి మించి సరకు రవాణా చేస్తున్నా పట్టని అధికారులు


పరిమితికి మించి బస్తాలను వాహనంపై రవాణా చేస్తున్న దృశ్యం

లంకెలపాలెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పలువురు వాహనదారుల నిర్లక్ష్యం రోడ్డుపై ప్రయాణించే వారిలో ఆందోళన పుట్టిస్తోంది. ప్రమాదం అని తెలిసినా పరిమితికి మించి సరకులను లోడు చేసి రవాణా చేస్తుండడంపై అంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతమైన ఫార్మాసిటీ లంకెలపాలెం రహదారిలో నిత్యం ఇదే తంతు కొనసాగుతున్నా కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. వాహనాల్లో పరిమితికి మించి డ్రమ్ములు, యంత్రాల విడి భాగాలు, స్క్రాప్ తదితర బస్తాలను లోడ్ చేస్తూ రవాణా చేస్తున్నారు. వాహనం కంటే ఎత్తుగా లోడ్ వేసి తాళ్లతో కట్టి దూసుకుపోతున్నారు. దీంతో సదరు వాహనాల పక్క గుండా ప్రయాణించాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. పొరపాటున ఆ తాళ్లు తెగితే ప్రమాదం తప్పదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లంకెలపాలెం పరిసర ప్రాంత గ్రామాల ప్రజలతో పాటు ఫార్మాసిటీలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు ఈ రహదారి గుండానే ప్రయాణిస్తుంటారు. పలువురు వాహనదారులు ఇంతగా నిబంధనలు తుంగలోకి తొక్కి సరకు రవాణా చేస్తుంటే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తరువాత హడావుడి చేసే కంటే, ముందుగానే స్పందించాలని పోలీసులు, రవాణా శాఖ అధికారులకు సూచిస్తున్నారు.

ఉపాధ్యాయ వృత్తి గొప్పది

▸▸ మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన వారి శిక్షణ శిబిరంలో డీఈవో అప్పారావునాయుడు


ఏపీటీఎఫ్ రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈవో అప్పారావునాయుడు, ఫెడరేషన్ ప్రతినిధులు

సబ్బవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయంలో మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన వారికి జరుగుతున్న శిక్షణ శిబిరాన్ని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి గొప్పదన్నారు. విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడంతో పాటు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసి ఆదర్శంగా నిలవాలని సూచించారు. అనంతరం ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రత్యేకంగా రూపొందించిన ఓరియంటేషన్ పుస్తకాలను ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటపతిరాజుతో కలిసి ఆవిష్కరించారు. కొత్తగా విధుల్లో చేరబోయే ఉపాధ్యాయులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వెంకటపతిరాజు మాట్లాడుతూ నూతన ఉపాధ్యాయల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ పుస్తకాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మారావు, దుర్గాప్రసాద్, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి ప్రసాదరావు, హేమంత్ సుదేవ్‌లతో పాటు మహాలక్ష్మీనాయుడు, బండారు ముత్యాలనాయుడు, తారక్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న కూటమి నాయకులు

కశింకోట, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి పెద్దగుమ్మం నుంచి అట్టవీధి వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు కూటమి నాయకులు గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు సమస్యను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దృష్టికి తీసుకు వెళ్లడంతో రూ.కోటి నిధులు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీను, కాండ్రేగుల సతీష్, వేగి పవన్ కుమార్, వేగి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

వంద మందికి కంటి వైద్య పరీక్షలు

అనకాపల్లి రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారేడుపూడిలో గురువారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ శిబిరానికి సుమారు వంద మంది వరకు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో 33 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాలాపు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

చేగువేరాకు ఘన నివాళులు

పరవాడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : విప్లవ వీరుడు చేగువేరా వర్ధంతిని మండల కేంద్రం పరవాడలో గురువారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి యువత చేగువేరాను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రజల కోసం పోరాడిన కమ్యూనిస్టు యోధుడు కీర్తించారు. సీఐటీయూ నాయకులు ఆర్.బాబూరావు, అప్పలరాజు, పద్మ, మంగ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

సబ్బవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర సూచించారు. మండలంలోని మలునాయుడుపాలెం గ్రామంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థినులకు గురువారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు రావన్నారు. అంతకుముందు బాలికలకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం లక్ష్మీసుమన్, పలువురు ఉపాధ్యాయలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో అందుబాటులో మందుల ధరలు

▸▸ వైద్య సిబ్బంది సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి

▸▸ ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచన


వైద్య సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హైమావతి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ 2.0 సంస్కరణల కారణంగా మందుల ధరలు తగ్గి రోగులకు అందుబాటులోకి వచ్చాయని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.హైమావతి అన్నారు. గురువారం ఇక్కడి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మందులు, వైద్యపరికరాలు, అత్యవసర మందులు అందుబాటు ధరల్లో ఉండడానికి జీఎస్టీ 12 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గిందన్నారు. కొన్ని మందులపై పూర్తిగా తగ్గించడం వల్ల ప్రజలకు వైద్యఖర్చులు తగ్గుతాయన్నారు. జీవిత, ఆరోగ్య పాలసీలపై గతంలో విధించిన 18 శాతం పన్ను దేశ వ్యాప్తంగా పూర్తిగా మినహాయింపు ఇచ్చారని పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణల అమలు వల్ల వైద్యరంగానికి సంబంధించిన ఆర్థికపరమైన ప్రయోజనాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి అవగాహన కల్పించాలని వైద్యులు, సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు ఆమె సూచించారు. ఈ సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ స్వప్న, డాక్టర్ చంద్రశేఖర్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో...

జీఎస్టీ సంస్కరణలపై ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో ఉన్న ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో డాక్టర్ లావణ్య స్థానికులకు అవగాహన కల్పించారు. 2017లో జీఎస్టీ వచ్చినప్పటి నుంచి ధరలు పెరగడంతో ఇబ్బందులు పడ్డారన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం తాజాగా చేపట్టిన సంస్కరణల వల్ల ధరలు బాగా తగ్గాయని వివరించారు. అంతకుముందు ఆసుపత్రి వద్ద జీఎస్టీ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


బయ్యవరం సభలో మాట్లాడుతున్న మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాబర్

తుమ్మపాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో...

తుమ్మపాల : సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌రావు అన్నారు. గురువారం ఇక్కడ మెడికల్ షాపుల యజమానులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సాధారణ మందులపై ఏడు శాతం, వైద్య నిర్ధారణ పరికరాలపై ఐదు శాతం జీఎస్టీ తగ్గిందన్నారు. అత్యవసర మందులపై జీఎస్టీ రద్దు చేసినట్టు చెప్పారు. మెడికల్ షాపు యజమానులు తమ వ్యాపార లావాదేవీల్లో ఖచ్చితంగా సూపర్ జీఎస్టీని అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది డి.శారదా, డి.మంగమ్మ, ఎం.మరియమ్మ, పంచాయతీ కార్యదర్శి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

బయ్యవరంలో...

కశింకోట : మండలంలోని బయ్యవరంలో సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై గ్రామ సభ ఏర్పాటైంది. జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె.రెహమాన్ (బాబర్) మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఎన్నో పథకాలను ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గండిబోయిన కాశీరావు, వైద్య సిబ్బంది, వీఆర్‌వో నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉదయం ఎండ.. సాయంత్రం భారీ వర్షం

▸▸ గత మూడు రోజులుగా నాలుగు మండలాల్లో ఇదే పరిస్థితి ▸▸ లోతట్టు ప్రాంతాలు జలమయం

▸▸ పలుచోట్ల సైడ్ కాలువలు పూడుకుపోవడంతో చెరువుల్లా మారిన రోడ్లు ▸▸ రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు


కొత్తూరు కాలేజీ కూడలి సమీపం జాతీయ రహదారిపై వర్షపు నీరు

కొత్తూరు, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి) : ఉపరితల ద్రోణి కారణంగా అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి వేడి వాతావరణం ఉన్నప్పటికీ సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. అనంతరం కుండపోతగా వాన కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు రోడ్లపై నీరు నిలిచిపోయింది. రాకపోకలకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనకాపల్లి మండలంలోని కొత్తూరు పంచాయతీ శారదానగర్‌లో పలు వీధులు వర్షపు నీటితో నిండిపోవడంతో స్థానికులు అవస్థలు పడ్డారు. ఎక్కడికక్కడ కాలువలకు అడ్డుగా నిర్మాణాలు చేపట్టడంతో చెత్తాచెదారం తొలగించలేదు. పూడిక పేరుకుపోవడంతో వర్షపు నీరు పారేందుకు ఆస్కారం లేకపోయింది. ఫలితంగా పలు వీధుల్లోకి, ఇళ్లలోకి నీరు చేరింది. కొన్నిచోట్ల రోజుల తరబడి వీధి రోడ్లపై నీరు నిలిచిపోతుండడంతో ఆయా ప్రాంతాల వారు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు. అలాగే, కాలేజీ కూడలికి సమీపంలో జాతీయ రహదారిపై నదిని తలపించేలా వర్షపునీరు రోడ్డుపైనే ప్రవహించింది. కాలువల్లో చెత్త పేరుకుపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కశింకోట మండలంలో...

కశింకోట : మండలంలో గత మూడు రోజులగా విభిన్న వాతావరణం నెలకొంటోంది. ఉదయమంతా తీవ్ర ఎండ.. సాయంత్రం భారీ వర్షం కురుస్తోంది. గురువారం కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. సాయంత్రం భారీ ఉరుములతో సుమారు గంట వర్షం పడింది. దీంతో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న వీధులన్నీ నీట మునిగాయి. కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి వెళ్లే రహదారిలో నీరు చెరువును తలపించింది. అంతేకాకుండా పశువైద్యాలయానికి వెళ్లే దారి కూడా ఇదే విధంగా ఉంది. తాళ్లపాలెం కూడలిలో వర్షపునీరు చెరువును తలపించేలా ముడుకు లోతులో నిలిచిపోయింది.


పరవాడలో భారీగా వర్షం కురుస్తున్న దృశ్యం


కశింకోట పీహెచ్‌సీకి వెళ్లే మార్గంలో...

పరవాడ మండలంలో...

పరవాడ : మండల కేంద్రం పరవాడ, పరిసర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు అర గంటకు పైగా కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రధాన రహదారుల పైనుంచి నీరు పారింది. పరవాడ పెద్ద చెరువు, పైడంబంధం చెరువులోకి వర్షపునీరు సమృద్ధిగా చేరింది. పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు బురదమయమయ్యాయి. అటుగా రాకపోకలు సాగించే గ్రామీణ ప్రజలు నానా అవస్థలు పడ్డారు. వరి పొలాల్లోకి సమృద్ధిగా నీరు చేరింది. వర్షం కారణంగా ఎలమంచిలి- గాజువాక ప్రధాన మార్గంలోని సినిమాహాల్ జంక్షన్, టి.రాజా హోటల్ సమీపంలో రహదారిపై ఉన్న గుంతలు ప్రమాదకరంగా మారాయి. దీంతో రాకపోకలు సాగించేవారంతా ఇబ్బందులు పడుతున్నారు.

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వాతావరణం ఉన్నప్పటికీ సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల వర్షం పడింది. దీంతో లోతట్టు ప్రాంతాల జలమయమయ్యాయి. ఆయా గ్రామీణ ప్రాంతాల రహదారులు చిత్తడిగా మారాయి. రాకపోకలకు జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఆర్‌వీనగర్-పాలగెడ్డ రహదారి నిర్మాణం ప్రారంభం



ఆర్‌వీనగర్‌లో రహదారిపై గోతులను పూడ్చుతున్న దృశ్యం

గూడెంకొత్తవీధి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్‌వీనగర్-పాలగెడ్డ అంతర్ రాష్ట్ర రహదారి నిర్మాణ పనులను ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రహదారి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.18 కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. ప్రస్తుతం గోతులను పూడ్చి రాకపోలకు అంతరాయం కలగకుండా చూస్తున్నామని, నెలాఖరున తారు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నట్టు వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పీవో దృష్టికి ఆర్టీసీ డిపో సమస్యలు



పీవోకు డిపో సమస్యలను వివరిస్తున్న డీఎం శ్రీనివాసరావు

పాడేరురూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పాడేరు ఆర్టీసీ డిపో సమస్యలను ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ దృష్టికి డిపో మేనేజర్ పి.శ్రీనివాసరావు తీసుకువెళ్లారు. పీవోను గురువారం ఆమె ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసిన ఆయన జిల్లా పరిధిలోని బస్సు సర్వీసులు, బస్ స్టేషన్‌లు, ఆదాయ వివరాలను వివరించారు. స్త్రీ శక్తి పథకంలో అమలులో సిబ్బంది చేస్తున్న కృషిని, ప్రజల నుంచి ఎదురవుతున్న సమస్యలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో ఆఫీసు సూపరింటెండెంట్ డప్పోడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డ్రగ్స్, సైబర్ నేరాలకు దూరంగా ఉండండి: సీఐ



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ హిమగిరి

అరకులోయ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక డిగ్రీ కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.భరత్‌కుమార్ నాయక్ అధ్య క్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ హిమగిరి మాట్లాడుతూ వి ద్యార్థులు ర్యాగింగ్ వంటి కార్యకలాపాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ లక్ష్యసాధన దిశ గా కృషి చేయాలన్నారు. సైబర్ నేరాల పై అప్రమత్తంగా ఉండాలన్నారు. స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఎల్.ఎం.ఎస్. గణేష్ మాట్లాడారు. ఈ సందర్భంగా సీఐని అధ్యాపకులు, విద్యార్థులు సన్మానించారు.

న్యాయమూర్తిపై దాడికి ఖండన



పాడేరులో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పాడేరురూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని పాడేరు బార్ అసోసియేషన్ సభ్యులు ఖండించారు. ఈ మేరకు గురువారం స్థానిక ప్రథమ శ్రేణి జుడీషియల్ కోర్టు ఆవరణలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పాడేరు బార్ ప్రెసిడెంట్ తమర్బ ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ సీజేఐపై దాడికి పాల్పడిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయవాదులు ఎస్.మోహన్ కృష్ణ, ఉల్లి సింహాచలం, జి.నాగేశ్వర, జె.ఝాన్సీ రాణి పాల్గొన్నారు.

పక్కాగా రేషన్ సరుకులు పంపిణీ

సీలేరు, అక్టోబరు 9 , (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు రేషన్ బియ్యం, సబ్సిడీ సరుకులు సక్రమంగా పంపిణీ చేయకుంటే చర్యలు తప్పవని జీకేవీధి తహసీల్దార్ అన్నాజీరావు హెచ్చరించారు. గురువారం జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధిలోని చిన్న గంగవరం జీసీసీ డిపోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిపోలో స్టాకు, రికార్డులను పరిశీలించారు. ప్రతీ నెలా డిపో పరిదిలోని లబ్ధిదారులకు సకాలంలో రేషన్ సరుకులు అందించాలన్నారు. లబ్ధిదారుల నుం చి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవని సేల్స్‌మెన్‌ను ఈసందర్భంగా తహసీల్దార్ హెచ్చరించారు.

మంచు తెరల్లో మన్యం



బందవీధి సమీపంలో మంచు దృశ్యం

జి.మాడుగుల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత రెండు రోజులుగా ఉదయం సమయంలో దట్టంగా మంచు కురుస్తోంది. గురువారం జి.మాడుగుల-పాడేరు వెళ్లే మార్గంలో పొగమంచుతో నిండిన దృశ్యం ఆకట్టుకుంది. మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది.



దారకొండ- గుమ్మిరేవుల రహదారిలో బురదలో కూరుకుపోయిన ఆటో



కోతకు గురైన పిల్లిగెడ్డ వంతెన అప్రోచ్

పునరుద్ధరణకు నోచని రోడ్డు, వంతెనలు

▸▸ రాకపోకలకు పలు గ్రామాల గిరిజనులు అవస్థలు

సీలేరు, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు కొ ట్టుకుపోయిన వంతెనలు, రహదారులను పునరుద్ధరించకపోవడంతో మారుమూల గ్రామాల గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జీకేవీధి మండలం ధారకొండ గుమ్మిరేవుల, ధారకొండ గంగవరం, ధారకొండ అగ్రహారం మార్గాల్లో గత ఏడాది సెప్టెంబరు 8వ తేదీన సంభవించిన పెను తుఫాన్‌కు వంతెనలు, రహదారులు కొట్టుకుపోయాయి. విపత్తు చోటుచేసుకుని నేటికీ ఏడాదవుతున్నా ఆయా మార్గంలో మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ రహదారుల్లో ఆటోలు, ఇతర వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. దీంతో గిరిజనుల అవస్థలు వర్ణనాతీతం. సంబంధిత అధికారులు, ఈ ప్రాంత నాయకులు రహదారులు, వంతెనలు పునరుద్ధరణకు కనీస చర్యలు చేపట్టలేదు. ఈ స్థితిలో ధారకొండ గుమ్మిరేవుల మార్గంలో బస్సు సౌకర్యం నిలిచిపోయింది. ఇకనైనా స్పందించి ధారకొండ, గుమ్మిరేవుల, ధారకొండ అగ్రహారం, ధారకొండ గంగవరం, ఒడిశాను కలిపే పిల్లిగెడ్డ వంతెనతోపాటు ఇతర పనులు చేపట్టిరాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

హెచ్‌పీ పెట్రోల్ బంక్ ప్రారంభం



నక్కపుట్టులో హెచ్‌పీ బంక్ ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్

పాడేరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో కిండంగి పంచాయతీ నక్కలపుట్టులో బొర్రా విజయరాణి ఫిల్లింగ్ స్టేషన్ పేరిట ఏర్పాటు చేసి హిందుస్థాన్ పెట్రోలియం కంపెనీకి చెందిన బంక్‌ను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. అభివృద్ధి చెందుతున్న జిల్లా కేంద్రంలో మరిన్ని వ్యాపార సంస్థలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, టీడీపీ నేతలు బాకూరు వెంకటరమణ, పాండురంగస్వామి, టి.సత్యనారాయణ, మాజీ ఎంపీపీ దన్నేరావు, తదితరులు పాల్గొన్నారు.

'పోషకాహారంపై అవగాహన కల్పించండి'



ఎంకే వీధి అంగన్‌వాడీలో నిర్వహించిన పోషణ మహా కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీవో తదితరులు

పాడేరురూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం, ఆరోగ్య పరీక్షలపై గర్భిణు లు, బాలింతలు అవగాహన పెంపొందించాలని సీడీపీవో జి.శారదాదేవి అన్నారు. గురువారం మండలంలోని ఎంకే.వీధి అంగన్‌వాడీ కేంద్రంలో చేపట్టిన పోషణ మహా కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. మహిళ గర్భ దాల్చినప్పటి నుంచి బిడ్డకు రెండేళ్ల వచ్చేంత వరకు అంగన్‌వాడీల్లో చేపట్టే కార్యక్రమాలపై (వెయ్యి రోజుల ప్రాముఖ్యతను) వివరించారు. తల్లుల పో షణ, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముర్రుపాలు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం 8 మంది గర్భిణులకు సీమంతాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.ప్రమీల, ఏఎన్ఎం మత్స్యకొండమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు ఎస్.చిన్నారి, ఎస్.అంబిక, కె.ఛాయాదేవి, కె.భాగ్యలక్ష్మి, ఆశాలు, మహిళా పోలీసు, పాల్గొన్నారు.

ప్రజల్లోకి జీఎస్‌టీ ఫలితాలు తీసుకువెళ్లాలి

▸▸ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

పాడేరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చిన జీఎస్‌టీ సంస్కరణలతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. టీడీపీ శ్రేణులకు జీఎస్‌టీపై అ వగాహన, ప్రచార కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో నాలుగు స్లాబులుగా ఉన్న జీఎస్‌టీని రెండుగా మార్చడం ద్వారా ప్రజలకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. ముఖ్యంగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు ఎంతో ఉపశమనం కలిగిందన్నారు. జీఎస్‌టీ సంస్కరణలతో చేకూరే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహనకు టీడీపీ శ్రేణులు కృషి చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలుపర్తి గోవిందరావు, టీడీపీ ఎస్‌సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, జి.మాడుగుల ఎంపీపీ అప్పలరాజు, పాడేరు పీఏసీఎస్ చైర్మన్ డప్పోడి వెంకటరమణ, మాజీ ఎంపీపీ బొర్రా విజయరాణి, నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన అధ్యక్షకార్యదర్శులు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యం పెంపునకు శిక్షణ తరగతులు

▸▸ సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి స్వామినాయుడు



చిలకలగెడ్డలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న స్వామినాయుడు

అనంతగిరి, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో మరింత సామర్థ్యం పెంపొందించేందుకు శిక్షణ తరగతులు దోహదపడతాయని సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి, మండల ప్రత్యేకాధికారి స్వామినాయుడు అన్నారు. మండలంలోని చిలకలగెడ్డలో ఉపాధ్యాయులు శిక్షణ తరగతులను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశాల మేరకు.. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అల్లూరి జిల్లాలో గిరిజన విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. జ్ఞానధార, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలన్నారు. ఎంఈవో-2 బీవీ నాగేశ్వరరావు, సీఆర్పీలు సునీత, గణేశ్, రవి పాల్గొన్నారు.

'ఉపాధ్యాయులకు బోధనేతర పనులు వద్దు'

అనంతగిరి, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఫ్యాప్టో పిలుపు మేరకు.. మండలంలోని శివలింగపురంలోని ఎంఈవో-2 బీవీ నాగేశ్వరరావుకు నాయకులు వినతిపత్రాన్ని గురువారం అం దించారు. పోరుబాటలో భాగంగా బోధనేతర పనులు అప్పగించవద్దంటూ గూగుల్ షీట్స్, విద్యాశక్తి, 2.0 తదితర ప్రచారాల కార్యక్రమాలకు చేపట్టామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు డి.సన్యాసిరావు, ఎస్.గురుదొర, పి.దేముడు, వి.ఈశ్వరరావు, ఎస్.రాంబాబు, ఎల్‌బీ. మంజునాథ్, ఎం.మల్లేశ్వరరావు, ఆర్.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

డుంబ్రిగుడ: ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈనెల 10నుంచి నిర్వహించున్న బోధనేతర విద్యాశక్తి కార్యక్రమానికి బహిష్కంచనున్నట్టు ఆ సంఘ నాయకులు బాలకృష్ణ, జలంధర్, రామారావు తెలిపారు. గురువారం ఎంఈవో సుందరరావుకు ఈ మేరకు వినతిపత్రమిచ్చారు. కార్యక్రమంలోఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.



ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

'ఆది కర్మయోగి'తో గ్రామాలభివృద్ధి: ఎంపీడీవో



మాట్లాడుతున్న ఎంపీడీవో ధర్మారావు

ముంచంగిపుట్టు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆది కర్మయోగి అభియాన్‌తో గిరిజన పల్లెలు మరింతగా అభివృద్ధి చెందుతాయని స్థానిక ఎంపీడీవో ధర్మారావు అన్నారు. మండలం కించాయిపుట్టు పంచాయతీ దారపల్లిలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలు, యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని కేంద్రం ప్రవేశ పెట్టిందన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల సద్వినియోగంపై అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ సుభాష్, గ్రా మ కార్యదర్శి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా గృహాలు



గ్రౌండింగ్ మేళాలో టీడీపీ మండలాధ్యక్షుడు , హౌసింగ్ అధికారులు

గూడెంకొత్తవీధి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పక్కా గృహాలు ప్రభుత్వం మంజూరు చేస్తోందని టీడీపీ మండలాధ్యక్షుడు పొత్తూరు కొండలరావు అన్నారు. గురువారం మండలంలో బొడ్డుమానుపాకలులో హౌసింగ్ గ్రౌండింగ్ మేళా నిర్వహించారు. పది గృహాలకు ఇంజనీరింగ్ అధికారులు మార్కింగ్ ఇచ్చి పనులను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ ఏఈ పసుపులేటి లక్ష్మి విమల, వర్కు ఇన్‌స్పెక్టర్ చిట్టిపడాల్, సూరిబాబు పాల్గొన్నారు.

జీఎస్‌టీ తగ్గింపుతో సామాన్యులకు మేలు

చింతపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనం కల్పిస్తూ ప్రభుత్వం జీఎస్‌టీ భారీగా తగ్గించినట్టు స్థానిక ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి అన్నారు. గురువారం లంబసింగి వారపు సంతలో ర్యాలీ నిర్వహించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నిత్యావసరాలు, గృహోపకరణాలు, వాహనాలు, వ్యవసాయ, పశుసంవర్థకశాఖ, పట్టుపరిశ్రమ, ఉద్యాన శాఖ యంత్రాలు, మందులపై భారీగా జీఎస్‌టీ తగ్గించిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొర్ర శాంతి, కార్యదర్శి అప్పలరాజు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలో ఏనుగురాయి పంచాయతీ పరిధి చోటాముకిపుట్టు, పరతాపుట్టు గ్రామాల్లో గురువారం కూటమి నేతలు, సచివాలయ సిబ్బంది జీఎస్‌జీ సంస్కరణలపై అవగాహన కల్పించారు.. తెలుగు యువత మండల అధ్యక్షుడు ఎం.చిన్ని, జనసేన మండల అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, సర్పంచ్ నరసింగరావు, వార్డు సభ్యులు బలరాం, బూత్ ఇన్‌చార్జి హరిదాస్, గిరిజనులు పాల్గొన్నారు.

కొయ్యూరు: ప్రభుత్వం తగ్గించిన జీఎస్‌టీపై ప్రజలు చైతన్యవంతులు కావాలని ఎంపీడీవో డి. బాల మురళీ కృష్ణ అన్నారు. గురువారం కంఠారం, కొమ్మిక పంచాయతీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాస్కరరావు, ఎన్ఎంలు పాల్గొన్నారు.



జీఎస్‌టీ తగ్గింపుపై వారపు సంతలో ప్రచారం చేస్తున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ప్రజాప్రతినిధులు

బాణసంచా విక్రయాల్లో నిబంధనలు తప్పనిసరి : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్ బర్దార్

పాడేరురూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ వస్తున్న నేపథ్యంలో బాణసంచా తయారీ, విక్రయాల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎస్పీ అమిత్ బర్దార్ సూచించారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బాణసంచా తయారీ, నిల్వ, విక్రయాలకు తప్పని సరిగా అనుమతులు కలిగి ఉండాలన్నారు. గొడౌన్‌లు, తయారీ కేంద్రాలు, షాపులు నివాస ప్రాంతాలకు నిర్దేశించిన దూరం లో ఉండాలన్నారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు తప్పకుండా పాటించాలని, అగ్నిప్రమాదం జరిగితే తక్షణమే తీసుకోవాల్సిన చర్యలపై పూర్తి అవగాహన కలిగిఉండాలని కోరారు. ప్రతి దుకాణం వద్ద తగినంత పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉంచాలన్నారు. మైనర్‌లను బాణ సంచా నిల్వ, తయారీ, విక్రయాలు చేసే కేంద్రాల వద్ద పనుల్లో పెట్టకూడదన్నారు. లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా రహస్యంగా మందుగుండు సామగ్రి తయారీ, నిల్వ చేసి 112 కాల్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు



దారకొండలో నిర్వహించిన ఆర్‌ఎస్ఎస్ ఉత్సవాల్లో నాయకులు, కార్యకర్తలు

సీలేరు, అక్టోబరు 9 , (ఆం ధ్రజ్యోతి): జీకేవీధి మండలం ధారకొండలో గురువారం రాష్ట్రీ య స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఉత్తరాంధ్ర విభాగ్ ప్రముఖ్ వెంకటరమణ పాల్గొని మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ దశాబ్ది ఉత్స వాలనువిజయదశమి సంబరాల్లో భాగంగా జిల్లా, మండల కేంద్రాలో ల నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ధారకొండ రామాలయం మైదానంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ధారకొండ, దుప్పులవాడ, సీలేరు ప్రాంతాలకు చెందిన వందలాది మంది పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలతో కలసి పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చింతపల్లి మండలం కృష్ణాపురం ఆశ్రమానికి చెందిన రామానందస్వామి, ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రముఖ్ బాబూరావు, రఘుపతి పా ల్గొని ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల ప్రాముఖ్యతను వివరించారు.

అటవీ ఫలసాయ మొక్కలు పంపిణీ



రైతులకు ఎన్‌టీఎఫ్‌పీ మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాడేరురూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింగర్భ పంచాయతీలో గురువారం సభల ప్రాజెక్టు ఆధ్వర్యంలో 50 మంది గిరిజన రైతులకు 10 రకాల అ టవీ ఫలసాయ మొక్కలను ప్రాజెక్టు జిల్లా ఇన్‌చార్జి నాయుడు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ఫలసాయాలు తగ్గిపోవడాన్ని గుర్తించి ఈ అటవీ ఫలసాయ మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ సురగం సత్యానారాయణ,గల్లుంగి రాజప్రకాష్, డీపీ గెమ్మెలి సింహాచలంనాయుడు, పెసా అధ్యక్షుడు కోడా గోపి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జి.మాడుగుల: గిరిజనులు అటవీ ఫలసాయల పెంపకం పై దృష్టి సారించాలని సబల్ ప్రాజెక్టు సంస్థ జిల్లా ఇన్‌చార్జి నాయుడు సూచించారు. గురువారం మండలంలోని సింగర్భ పంచాయతీ నిమ్మవిధి, బూరుగువీధి తదితర గ్రామాల్లో ఎన్ఎఫ్‌పీ మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎస్. సత్యానారాయణ, జి.రాజప్రకాశ్, జి.సింహాచలం నాయుడు, పెసా నాయుడు కె.గోపి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కరదీపిక ఆవిష్కరణ



కరదీపికను ఆవిష్కరిస్తున్న డీఈవో, తదితరులు

పాడేరురూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ - 257 సంఘం 2025-డీఎస్సీలో ఎం పికైనఉపాధ్యాయుల కోసం రూపొందించిన కరదీపికను డీఈవో పి.బ్రహ్మాజీరావు గురువారం ఆవిష్కరించారు. అరకు, అడ్డతీగెలలో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులకు ఈ కరదీపికలను ఉచితంగా అందిస్తున్నట్టు టీచర్స్ ఫెడరేషన్ సంఘం జిల్లా అధ్యక్షులు రావుల జగన్మోహనరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ.శ్యామ్‌సుందరం, కె.పోతురాజు, బి.సోంబాబు, ఎం.సత్యారావు, వి.భైరవమూర్తి నాయుడు, పి.బాబూరావు పాల్గొన్నారు.

'షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాలపై చట్టం చేయాలి'

పాడేరురూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకా ల చట్టంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్ రామారావు దొర డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీఏసీ ఏర్పాటు చేసి నాలుగు నెలలు గడిచినా ఇంకా ప్రమాణ స్వీకారం చేయలేదన్నారు. ఇకనైనా వారికి పూర్తి బాధ్యతలను అప్పగించి షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టంపై తీర్మానం చేయాలని కోరారు. ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంజిరావు, ఆనంద్, మాధవరావు, బాబూజీ, కామేశ్, సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళలు పోషకాహారం తీసుకోవాలి: సీడీపీవో



మాట్లాడుతున్న సీడీపీవో దేవమణి

కొయ్యూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు పోషకాహారం తీసుకోవాలని స్థానిక సీడీపీవో దేవమణి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పోషణ్ మహా కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు సీ మంతాలు చేశారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆకు కూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు ఆహారంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బీపీసీ పాల్గొన్నారు.

నర్సీపట్నం తరలి వెళ్లిన ఎమ్మెల్యే, వైసీపీ శ్రేణులు

పాడేరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలోని మెడికల్ కాలేజీని సందర్శించేందుకు గురువారం మాజీ సీఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి విచ్చేసిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, వైసీపీ నేతలు నర్సీపట్నం తరలివెళ్లారు. ఈ క్రమంలో స్థానిక వంతాడపల్లి అటవీ చెక్‌గేటు వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇదే క్రమంలో నర్సీపట్నం వెళుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును పోలీసులు అడ్డుకున్నారు. తర్వాత అనుమతిస్తూ అధిక సంఖ్యలో జనాన్ని తరలించవద్దని పోలీసులు సూచించారు. దీంతో ఎమ్మెల్యే తన అనుచరులతో నర్సీపట్నం వెళ్లారు.

ఘనంగా చెగువేరా వర్ధంతి

పాడేరురూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ ఆధ్వర్యంలో గురువారం విప్లవ వీరుడు చెగువేరా వర్ధంతి ఘనంగా చేపట్టారు. ముందుగా చెగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ చెగువేరా గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, పి.నానిక ఎం.సతీశ్, పి.చందు, పి.ధన, కె.ఇందు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కాఫీ రైతుల దీక్షలు

గూడెంకొత్తవీధి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదవలస గ్రామ పంచాయతీలో స్థానిక కాఫీ రైతులు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. బుధవారం పాడేరు ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ రైతుల తో చర్చించారు. హైవే నిర్మాణంలో కాఫీ తోటలు కోల్పోతున్న రైతులకు పరిహారం పది రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అయితే, రెవెన్యూ అధికారులు లిఖిత పూర్వక హామీ ఇవ్వకపోడంతో రైతులు యథావిధిగా దీక్ష కొనసాగిస్తున్నట్టు తెలిపారు.

అనుమతులు లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ

- 'ఎల్‌ఆర్‌ఎస్'కు దరఖాస్తు చేసుకునేందుకు 23 వరకు మాత్రమే గడువు
- 2020 నాటి పథకాన్నే కొన్ని సవరణలతో కొనసాగిస్తున్న ప్రభుత్వం
- సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచన

నర్సీపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ పరిధిలోని మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో ప్రభుత్వ అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఈనెల 23 వరకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. 2020 ఎల్‌ఆర్‌ఎస్ పథకంలో కొన్ని సవరణలు చేసి అదే పథకాన్ని జూలై నెలలో జీవో నెంబరు 134 విడుదల చేసింది. నర్సీపట్నం మునిసిపాలిటీలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీరణ కోసం 2020లో 75 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 69 లే-అవుట్లుకు అనుమతులు మజూరు చేశారు. ఆరు దరఖాస్తులను తిరస్కరించారు. తాజాగా మరో పది దరఖాస్తులు వచ్చాయని టౌన్‌ప్లానింగ్ అధికారి హనుమంతు వెంకట సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 23 తేదీ వరకు ఎల్‌ఆర్‌ఎస్‌కి గడువు ఇచ్చారు. అనధికార లేఅవుట్లు క్రమబద్ధీకరించుకుంటే భవనాలకు చట్టబద్ధత వస్తుందని వివరించారు. విద్యుత్, నీటి సరఫరా, డ్రైనేజీ, సీవరేజ్ కనెక్షన్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. భవిష్యత్తులో న్యాయబద్ధమైన లావాదేవీలకు అవకాశం ఉంటుంది. భవన నిర్మాణాలకు బ్యాంకు రుణాలు మంజూరు చేస్తారు. అక్రమ లేఅవుట్లు క్రమబద్ధీరించుకుంటే ఖాళీ స్థలానికి వేసే చార్జీలలో 50 శాతం రాయితీ ఇస్తున్నారు.


అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్‌ను పరిశీలిస్తున్న టీపీవో

నిబంధనల ప్రకారం లేఅవుట్‌లోని ఖాళీ స్థలానికి 14 శాతం చార్జీ చెల్లించాల్సి ఉండగా ఏడు శాతం చెల్లిస్తే సరిపోతుంది. అనధికార లేఅవుట్లలో మునిసిపాలిటీ మౌలిక సదుపాయాలు కల్పించదు. ఇటు వంటి లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేస్తే భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వరు. రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించరు. ఎల్‌ఆర్‌ఎస్ పథకం ముగిసిన తర్వాత పాత అభి వృద్ధి ప్రాంతాలు, ఎల్‌ఆర్‌ఎస్‌లో అనుమతి తీసుకున్న లేఅవుట్లు, మునిసిపాలిటీ అనుమతి ఇచ్చిన లేఅవుట్లలో స్థలాలకు మాత్రమే భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. అను మతులు లేకుండా వేసిన లేఅవుట్లలోని స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు భవిష్యత్తులో అనుమతులు రాకపోవచ్చునని అంటున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని అనధికార లేఅవుట్లు, అనధికార స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలని కమిషన్ జంపా సురేంద్ర కోరారు.

జాబ్ కార్డులు ఉన్న ఉపాధి కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి


ఎర్రవరంలో ఉపాధి కూలీలను ఉద్దేశించి మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గొలుగొండ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కలిగిన కూలీలు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ఎర్రవరం, చీడిగుమ్మలతో పాటు పలు గ్రామాల్లో గురువారం ఈకేవైసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రవరంలో కూలీలతో ఆయన మాట్లాడారు. మండలంలోని సుమారు 16 వేల జాబ్‌కార్డులు ఉన్నాయన్నారు. వచ్చే ఏడాది నుంచి ఉపాధి పనుల్లో పాల్గొనే కూలీలకు తప్పనిసరిగా ఈకేవైసీ ఉండాలన్నారు. ఈకేవైసీ నమోదుకాకపోతే పనులు కల్పించకపోగా, జాబ్‌కార్డు రద్దు చేయడం జరుగుతుందని వివరించారు. ఉపాధి కూలీలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అలాగే, పనులకు వెళుతున్న వారు తమకు అప్పగించిన కొలతల ప్రకారం పనులు పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీవో రమామణి, సిబ్బంది స్వామి తదితరులు పాల్గొన్నారు.

గోవాడ క్రషింగ్‌పై స్పష్టత ఇవ్వండి: జనసేన


ఎండీతో మాట్లాడుతున్న జనసేన ఇన్‌చార్జి పీవీ ఎస్ ఎన్ రాజు, ఇతర నేతలు

చోడవరం, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్‌పై రైతుల్లో కార్మికుల్లో నెలకొన్న సందిగ్ధతపై ఫ్యాక్టరీ యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ ఎస్ ఎన్ రాజు డిమాండ్ చేశారు. గురువారం ఫ్యాక్టరీ ఎండీతో సమావేశమైన జనసేన నేతలు, ఫ్యాక్టరీ స్థితిగతులపై చర్చించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, గత రెండు సీజన్లకు సంబంధించి బకాయిలు ఎప్పటిలోగా చెల్లిస్తారనేది రైతులకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది మహాజన సభ నిర్వహించలేకపోవడంలో అధికారులు విఫలం కావడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే, ఈ ఏడాది ఫ్యాక్టరీ నడుపుతారా? లేదా? అనే దానిపై రైతులకు తేల్చిచెప్పాలని కోరారు. ఫ్యాక్టరీలో నిధులు వ్యవహారాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎండీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, చెరకు రైతుల బకాయిలపై ప్రభుత్వానికి నివేదిక పంపించామని, ఈ సీజన్‌లో క్రషింగ్‌పై కేన్ కమిషనర్ త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా పీవీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ, గోవాడ ఫ్యాక్టరీ పరిస్థితి, రైతుల కార్మికుల బకాయిలపై పూర్తి వివరాలతో త్వరలోనే పరిశ్రమల శాఖ మంత్రిని కలిసి నివేదిక అందించనున్నట్టు తెలిపారు. ఎండీతో సమావేశంలో స్థానిక మార్కెట్ కమిటీ ఛైర్మన్ అల్లం మాదవి, రామప్పారావు, దొడ్డి ప్రసాద్, మంగా శ్రీను, ఆడారి నాయుడు, పీలా మహేశ్, చప్పగడ్డ శ్రీను, బి. భగవాన్, జగదీశ్, ఉదయ్, గోపీ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు


పశువుల దాణా అందిస్తున్న వైద్యాధికారి గాయత్రీదేవి

దేవరాపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిశింగిలో గర్భకోశ వ్యాధి పరీక్షలు గురువారం చేశారు. విశాఖపట్నం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో 30 పశువులకు గర్భకోశ చికిత్స అందించారు. 20 పశువులకు చూడి పరీక్ష, 35 పశువులకు ఇతర వైద్య సేవలు అందించినట్లు పశు వైద్యాధికారి గాయత్రీదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి చెరకాన సూర్యనారాయణ, నరసింహనాయుడు, అల్లం విశ్వనాథం, సురేశ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నియంత్రణ అందరి బాధ్యత


కొవ్వూరులో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

రోలుగుంట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు నివారణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సెక్టారు సూపర్‌వైజర్ హైమావతి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొవ్వూరు, రోలుగుంట, కొమరవోలు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఇంటర్నేషనల్ డే ఆఫ్ గర్ల్ ఛైల్డ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం అభివృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలలను సాకారం చేసుసుకునే దూరం చేస్తుందన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతీ ఒక్కరూ ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లో బాలికలకు లింగ వివక్షత మరియు బాల్య వివాహాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శేషగిరిరావు, గ్రామ మహిళా పోలీసు వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హిందూ మత పరిరక్షణకు కృషి: ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రముఖ్

బుచ్చెయ్యపేట అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో హిందూ మత సంరక్షణకు ఆర్ఎస్ఎస్ ఎంతగానో కృషి చేస్తోందని జిల్లా ప్రముఖ్ గట్రెడ్డి జగదీశ్వరరావు అన్నారు. స్థానిక విజయ దుర్గాదేవి ఆలయంలో


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ఎస్ జిల్లా ప్రముఖ్ జగదీశ్వరరావు

ఆర్‌ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ జిల్లా సాంస్కృతిక ప్రముఖ్ వరహా నాగేశ్వరరావు, పూడి రామారావు, సుంకరి సత్యారావు , బి. మణికంఠ, గోపిశెట్టి శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ మండలంలో భారీ వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నిండుకుండలా చెరువులు, గెడ్డలు
- పలు చోట్ల పల్లె రోడ్లు ఛిద్రంతో రాకపోకలకు అవస్థలు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా గొలుగొండ మండలంలో గురువారం భారీవర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయి జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏఎల్‌పురం, చోద్యం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట, నాగాపురం, కొంగసింగి తదితర గ్రామాల్లో ఎటుచూసినా నీరే కనిపించింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెరువులు, బొడ్డేరు గెడ్డలు నీటితో కళకళలాడుతున్నాయి. ఏఎల్‌పురం- కొంగసింగి, చోద్యం, పాత కృష్ణాదేవిపేట తదితర రహదారుపై పడిన గుంతల్లో వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళ ఇది గుర్తించలేని పలువురు చిన్న చిన్న ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం కారణంగా ఏఎల్‌పురంలో హైస్కూల్‌లో నీరు ఎటూ పారలేని పరిస్థితి ఏర్పడింది. బీసీ కాలనీ లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరడంతో నివాసితుల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. కాలువల్లో పూడికలు తొలగించి, అవసరమైన చోట ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తే ఈ పరిస్థితి ఉండదని అంతా అభిప్రాయపడుతున్నారు.


బస్ స్టేషన్ మార్గంలో..



కృష్ణాదేవిపేటలో భారీగా వర్షం కురుస్తున్న దృశ్యం

జీఎస్టీ సంస్కరణల ఫలితాలపై నేడు అవగాహన సదస్సు

నర్సీపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో 'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్'పై శుక్రవారం ఉదయం సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. జీఎస్టీ సంస్కరణల వల్ల గృహోపకరణాలు, సిమెంటు, ఎలక్ట్రానిక్ వస్తువులు, మందులు తదితర ధరలు ఏ మేరకు తగ్గాయి, ఎంత వరకు వినియోగదారుడుకి మేలు జరిగిందన్న విషయాన్ని అవగాహన కల్పిస్తారు. ఈ సదస్సుకు జీఎస్టీ జాయింట్ కమిషనర్ టి.శేషాద్రి, అచ్యుతాపురం సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ సింధూప్రియ, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ పీవీ శైలజ, ఎస్.మంజుల, పి.శ్వేత ప్రభుత్వం తరఫున సదస్సుకు హాజరు కానున్నారు. ప్రతి ఒక్కరూ హాజరై జీఎస్టీపై అవగాహన పెంచుకోవాలని వారు కోరారు.


గత జనవరి నెలలో రోడ్డు మరమ్మతుల తర్వాత


ప్రస్తుత రహదారి దుస్థితి

అధ్వాన రహదారితో అవస్థలు వర్ణనాతీతం

- అడుగడుగునా గోతులతో ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి మాడుగుల వెళ్లే రోడ్డు

మాడుగుల రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి మాడుగుల వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. జంక్షన్‌కి కూత వేటు దూరంలో పడిన గోతుల్లో వర్షంనీరు నిలిచిపోయి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గత జనవరిలో ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి మాడుగులకు సుమారు 4 కిలోమీటర్ల మేర రూ.15 లక్షలతో మరమ్మతు పనులు చేపట్టారు. కంకరరాళ్ల తారువేసి గోతులు పూడ్చారు. మరికొన్నిచోట్ల కొత్తగా రోడ్డు వేశారు. అయితే తొమ్మిది నెలలు గడవకుండానే మళ్లీ యథాతథమైంది. రోడ్డుపైకి మురుగునీరు, వర్షం నీటి వల్ల గోతులు మరింత పెద్దవయ్యాయి. వీటి వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి సమయాల్లో మరింత దారుణంగా ఉంది. మాడుగుల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ రోడ్డు మార్గంలో ప్రయాణించి ఘాట్‌రోడ్డు జంక్షన్‌కి చేరుకుని వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో మాడుగుల గ్రామస్థులూ ఇబ్బంది పడుతున్నారు. తూతూ మంత్రంగా గుంతలు పూడ్చి చేతులు దులుపేసుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపట్టడం లేదని పలువురు మండి పడుతున్నారు. గుంతలు రోడ్డు సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

డీ పట్టా గిరిజన రైతులకు న్యాయం చేస్తాం

- మాడుగుల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అప్పలరాజు


మాట్లాడుతున్న పుప్పాల అప్పలరాజు

మాడుగుల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మాడుగుల, రావికమతం మండలాల్లో కొండ భూములు సాగు చేస్తున్న గిరిజన రైతులకు న్యాయం చేసే దిశగా ప్రయత్నిస్తామని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. గురువారం స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉరలోవ, నాగళ్ళ కొండల పరిధిలో డీ ఫారం 654.47 ఎకరాలు సాగు చేస్తున్న 469 మంది రైతులున్నారు. వీరిలో కొంత మందికి గతంలో పట్టాలను ప్రభుత్వం అందించినట్టు చెప్పారు. మిగిలిన రైతులకు కూటమి ప్రభుత్వంలో న్యాయం చేసే దిశగా చర్యలు తీసుంటామన్నారు. ఈ సమస్యను బండారు సత్యనారాయణ మూర్తి ద్వారా జిల్లా కలెక్టర్‌కు తెలియజేశామన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందవరపు సన్యాసిరావు, కార్యదర్శి పుప్పాల రమేశ్, పెద్దేరు జలాశయ ఛైర్మన్ అద్దేపల్లి జగ్గారావు, కింతలి పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ ఉందూరు దేముడు, సర్పంచ్‌లు సుంకరి సింహాచలం నాయుడు, చామంతుల నాగమణి, జయరాం, వడ్డాది చారుమతి దేవి, కూటమి నాయకులు పాల్గొన్నారు

78 మందికి నేత్ర వైద్య పరీక్షలు



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కె.కోటపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగన్నదొరపాలెంలో గురువారం విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వారు స్థానిక సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 78 మందికి వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి వీరిలో 16 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో బొంతు మంగపతిరావు, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ క్యాంప్ కో-ఆర్డినేటర్ పి. శివకుమార్, టెక్నీషియన్లు మహేందర్, రెడ్డి నజీర్‌బాషా, సాయికుమార్, వరలక్ష్మి, మహేంద్ర నాయక్, సంతోషి భూపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ దృష్టి దినోత్సవం


వ్యాసరచన పోటిలలో పాల్గొన్న విద్యార్థులు

బుచ్చెయ్యపేట అక్టోబరు 9 (ఆంధ్ర జ్యోతి): మండలంలో దిబ్బిడి హైస్కూల్‌లో ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని పిల్లలకు వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కె.సత్యారావు ,మాట్లాడుతూ సెల్ ఫోన్ వాడకం వాడకం తగ్గించుకోవాలన్నారు. కళ్ల సంరక్షణకు పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. కంటి ఆరోగ్యం కోసం పండ్లు, కూరగాయలు, ఒమేగా 3 ప్యాటీ యాసిడ్లు గల చేపలు తీసుకోవాలని కోరారు. తగినంత నిద్ర ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమములో ఉపాధ్యాయులు మూర్తి ,రాజు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా కొత్తకోట హైస్కూల్ ఎస్పీఎల్ ఎన్నిక


ఎన్నికైన విద్యార్థులతో హెచ్‌ఎం రాజ్‌కుమార్

రావికమతం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట జెడ్పీ హైస్కూల్‌లో ఎస్పీఎల్ స్థానానికి గురువారం ఎన్నిక హోరాహోరీగా జరిగింది. ఎన్నికకు బాలురతోపాటు అమ్మాయిలూ పోటీ పడ్డారు. 412 మంది ఉన్న ఈ పాఠశాలలో ఎస్పీఎల్ ఎంపికకు హెచ్‌ఎం జేజే రాజ్‌కుమార్ బుధవారం ఆదేశించారు. దీంతో జి.అఖిలాండేశ్వరి, ఎ. చరణ్‌తేజ, వేవహర్ష, వి.హర్షిత, కె.యామినిలు పోటీ పడ్డారు. ఈ ఎన్నికను ఏకగ్రీవానికి ఉపాధ్యాయులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ స్థితిలో అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. ఓటింగ్ ద్వారా ఎన్నిక పక్రియ నిర్వహించారు. 374 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ పోటీలో ద్వారపురెడ్డి దేవహర్షకు 133 ఓట్లు సాధించడంతో ఎస్పీల్‌గా ఎన్నికయ్యారు. 123 ఓట్లతో అఖిలాండేశ్వరి ద్వితీయ స్థానంలో నిలించింది. ఈ ఇద్దరినీ విజేతలుగా హెచ్‌ఎం ప్రకటించారు. కాగా, అడ్డూరి చరణ్‌తేజకు 111 ఓట్లు వచ్చి మూడవ స్థానంలో నిలిచారు. మిగిలిన వారికి నామమాత్రపు ఓట్లు పడ్డాయి. విజేతలను ఉపాధ్యాయులు అభినందించారు.

జీఎస్‌టీపై అవగాహన పెంపొందించుకోవాలి

- ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు

చోడవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో గురువారం జీఎస్‌టీ 2.0పై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జీ ఎస్‌టీ పోస్టర్‌లను ఆయన ఆవిష్కరించారు. ఈ జీఎస్‌టీ తగ్గింపులో ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ జగదీశ్, ఎండీవో అంజనేయులు, మాజీ ఎంపీపీ పెదబాబు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ దేవరపల్లి వెంకట అప్పారావు, మెంబర్లు బాలిబోయిన పార్వతి, పప్పు శ్రీను, బొబ్బిలి ఈశ్వరరావు, దేవుడు, టీడీపీ నాయకులు సకురు కోటేశ్వరరావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఎర్రంశెట్టి చిన్న, ఎంపీటీసీ సభ్యురాలు కొట్టాపు రూపాదేవి, సేమాల హరి, ఎలకా మల్లిబాబు, పార్దురాజుతో పాటు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జీ ఎస్‌టీ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రాజు, వైద్యులు


కె. కోటపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కె. కోటపాడులో ర్యాలీ

కె.కోటపాడు: సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం పై స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో సాంబశివరావు పాల్గొని మాట్లాడారు. హెల్త్ ఇన్సూరెన్స్, ఇతర వైద్య పరికరాలు, నిత్యావసర సరకులు, గృహోపకరణాలు తదితర వాటిపై జీఎస్‌టీ తగ్గినట్టు చెప్పారు. ముందుగా జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రంశెట్టి భవాని, సెక్రటరీ టి. శ్రీను, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేల బావితో పొంచి ఉన్న ప్రమాదం


కేజేపురం- దబ్బగుంట మార్గంలో నేల బావి


మాడుగుల రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేజేపురం- దబ్బగుంట మీదుగా మాడుగుల వచ్చే దారిలో రోడ్డు పక్కనే ఉన్న నేలబావితో ప్రమాదం పొంచి ఉంది. ఈ మార్గంలో వంటర్లపాలెం, కేజేపురం గ్రామస్థులు ప్రయాణిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు నేలబావి నీటితో పూర్తిగా నిండింది. సమీపంలో ఏమాత్రం ఏమరపాటుగా వాహనం నడిపినా నేరుగాబావిలోకి పడిపోయే ప్రమాదం ఉంది. నేలబావిని ఆనుకుని తుప్పలు, పిచ్చి మొక్కలు కప్పేశాయి. దీంతో ఆ వైపుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు భయపడుతున్నారు. ఈ మార్గాన కేజేపురం రైతుల పంట పొలాలు, కళ్లాలు ఉండడంతో రాత్రి సమయాల్లో కూడా రాకపోకలు సాగిస్తుండడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. ఈ స్థితిలో ప్రమాదాలు జరగకుండా చర్యలు అధికారులు తీసుకోవాలని కోరుతున్నారు.

తీరని వేదన

- ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న మానసిక సమస్యలు
- ప్రకృతి విపత్తులు, యుద్ధాలు వంటి పరిస్థితులే కారణం
- సమస్యలపై ప్రజల్లో అవగాహన అవసరం
- సకాలంలో గుర్తిస్తే సాంత్వన చేకూర్చే అవకాశం
- నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):

మానసిక సమస్యల బారినపడుతున్న వారి సంఖ్య ఇటీవల పెరుగుతోంది. ఇంట్లో ఇబ్బందులు, కుటుంబ పర మైన, ఆర్థిక ఇబ్బందులు మానసిక సమస్యలకు దారితీస్తున్నాయి. ఈ తరహా సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా అక్టోబరు పదో తేదీన వరల్డ్ మెంటల్ హెల్త్ డే నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో మానసిక ఆరోగ్యం అందుబాటులో ఉంచడం థీమ్‌తో వారోత్సవాలను నిర్వహించనున్నారు.



ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న విపత్కర పరిస్థితులు అనేకమందిలో మానసిక సమస్యలకు కారణమవుతున్నట్టు వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెంటల్ హెల్త్ ఆర్గనైజేషన్ గుర్తించింది. వివిధ దేశాల మధ్య యుద్ధాలు, కరోనా వ్యాప్తి, ప్రకృతి విపత్తులు తీవ్రమైన కుంగుబాటుకు గురిచేస్తున్నాయంటున్నారు. గత పదేళ్లలో ప్రపంచ వ్యాప్తంగా యుద్ధం, ఇతర విపత్తుల వల్ల సంఘర్షణను అనుభవించిన ప్రతి ఐదుగురిలో ఒకరు నిరాశ, ఆందోళన, పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్, బైపోలార్ డిజార్డర్, స్కిజోఫ్రీని యా వంటి మానసిక సమస్యలకు గురయినట్టు నిపుణులు చెబుతున్నారు. ఈ తరహా అత్యవసర పరిస్థితులు నెలకొన్న ప్రాంతాల్లో మానసిక వైద్య సేవలను అందించడం కూడా ఇబ్బందిగా మారుతోందంటున్నారు.

భరోసా కల్పించేలా చర్యలు

విపత్తులు, ఇతర అత్యవసర పరిస్థితులు నెలకొన్న ప్రాంతాల్లోని ప్రజలకు భరోసాను ఇవ్వడం కీలకమని చెబుతున్నారు. విపత్తులు, అత్యవసర పరిస్థితులు నెల కొన్న ప్రాంతాల్లోని ప్రజలతో కలిసి పనిచేసేందుకు ప్రజలు ముందుకురావాలి. బాధితులకు మానసిక, శారీరక ఆరోగ్య సేవలను అందించాలి. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, నిపుణులు సహకరించాలి. ముఖ్యంగా పిల్లల్లో ఈ తరహా ఒత్తిడి అధికంగా ఉంటుంది. దానిని గుర్తించి బయటప డేలా కౌన్సెలింగ్, మందులను అందించి సాధారణ స్థితికి తీసుకురావాలి.

భయాందోళనలే కారణం



ప్రకృతి విపత్తులు, యుద్ధాలు వంటివి ఎంతో మందిపై తీవ్ర ప్రభావం చూపిస్తుం టాయి. ఎప్పుడు ఏం జరుగు తుందన్న ఆందో ళనతో డిప్రెషన్, పోస్టు ట్రామాటిక్ స్ట్రెస్ బారినపడుతున్న వారి సంఖ్య పెరిగింది. దేశంలోని అనేక ప్రాం తాల్లో వరదల వల్ల ఎంతోమంది ప్రాణా లను కోల్పో యారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు కొన్ని రోజులపాటు మానసికంగా కుంగుబాటుకు గురయ్యారు. ఈ తరహా సమస్యలతో బాధపడుతున్న వారికి కౌన్సె లింగ్ ఇచ్చాం. వారం రోజులపాటు అవగాహన కార్యక్రమాలు, సింపోజియం నిర్వహిస్తున్నాం.

- డాక్టర్ ఎంవీఆర్ రాజు, సైకాలజీ విభాగాధిపతి

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



కెల్లా భాస్కర్ (ఫైల్)

నర్సీపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బలిఘట్టం వద్ద వరహానదిలో గల్లంతైన యువకుడి మృతదేహం గురువారం లభ్యమైంది. నర్సీపట్నం డాన్‌బాస్కో స్కూల్ సమీపంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న కెల్లా భాస్కరరావు (35) బుధవారం బంధువు చనిపోతే అంత్యక్రియలకు హాజరయ్యాడు. బలిఘట్టం శ్మశాన వాటికలో అంతిమ సంస్కారాలు అనంతరం స్నేహితులతో కలిసి లింగాపురం వంతెన కింద వరహానదిలో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. గురువారం ఉదయం 7 గంటలకు మృతదేహం నదిలో లేలింది. మృతుని భార్య శిరీషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.5,82,472

నర్సీపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.5,82,472 వచ్చినట్టు దేవదాయ శాఖ కార్యనిర్వహక అధికారి సాంబశివరావు తెలిపారు. గత 30 రోజులుగా అమ్మవారి హుండీలో భక్తులు వేసిన కానుకలు గురువారం లెక్కించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి డి.ఉమాదేవి, ఆలయ చైర్మన్ జంప నాగేంద్ర, శ్రీవారి సేవా భక్తులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి జీఎస్టీ 2.0 ఫలాలు అందజేయాలి

కోటవురట్ల అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కోటవురట్ల మేజర్ పంచాయతీ కార్యాలయంలో జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ జీఎస్టీ 2.0 ఫలాలు ప్రతి ఇంటికి అందాలన్నారు. జీఎస్టీ సంస్కరణలతో ప్రతి ఇంట్లో దీపావళి కాంతులు వెల్లివిరుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు ఆదేశాలతో జీఎస్టీపై ప్రచారం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలిగించేలా జీఎస్టీ సంస్కరణలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మరావు, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ హాకీ సెలక్షన్స్ ప్రారంభం



ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ హాకీ జట్టుకు ఎంపికైన బాలికలు

నక్కపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా బాల,బాలికల హాకీ క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ గురువారం నక్కపల్లి హాకీ మైదానంలో ప్రారంభమైంది. బీఎస్ హాకీ క్లబ్ వ్యవస్థాపకులు బలిరెడ్డి సూరిబాబు, హైస్కూల్ హెచ్‌ఎం కె.విజయ ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 150 మంది హాకీ క్రీడాకారులు తరలివచ్చారు. పరిశీలకులుగా అనకాపల్లి ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కేఎం నాయుడు, ఎస్వీ నర్సింహం, ఎం.నాగేశ్వరరావు హాజరయ్యారు. తొలి రోజు 17 మంది క్రీడాకారిణులతో బాలికల జట్టును ఎంపిక చేశారు. జిల్లా ఎస్‌జీఎఫ్ బాలిక హాకీ జట్టుకు ఎంపికైన వారిలో బండి జయశ్రీ, కె.టోనేశ్వరి, ఎస్.లవకుమారి, బీ దేవి, కె.శాంతి రాణి, జి.లక్ష్మి, బి. పావని, టి.శ్రావణిదేవి, ఎస్.జాహ్నవి, ఎం.దుర్గా, బి.రమ్యశ్రీ, ఐ.సునీత, మేరీ టోపు, ఎ.అపూర్వ, ఎస్.కనకమహాలక్ష్మి, కె.సౌజన్య ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో హాకీ క్లబ్ సెక్రటరీ కొల్నాటి తాతాజీ, పీడీలు కుందురూ రాజు, కిరణ్‌కుమార్, అన్నాజీ, ఇందిరా రాణి, శిరీషా పాల్గొన్నారు.

ఎన్‌ఏపీఎస్ ద్వారా యువతకు ఉపాధి కల్పన

- జేఎన్‌పీసీఎంఏ కార్యదర్శి జెట్టి సుబ్బారావు



వర్క్‌షాపులో మాట్లాడుతున్న జేఎన్‌పీసీఎంఏ కార్యదర్శి జెట్టి సుబ్బారావు

పరవాడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీం (ఎన్‌ఏపీఎస్) ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతాదని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ మ్యాన్ ఫ్యాక్చరింగ్ అసోసియేషన్ (జేఎన్‌పీసీఎంఏ) కార్యదర్శి జెట్టి సుబ్బారావు చెప్పారు. ఫార్మాసిటీలోని ఎంఏఎస్‌ఆర్‌ఎం కార్యాలయంలో గురువారం పలు ఫార్మా పరిశ్రమలకు చెందిన హెచ్‌ఆర్ హెడ్‌లు, ప్లాంట్ మేనేజర్లు, సీఎస్‌ఆర్ హెడ్‌లు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పరిశ్రమలకు నైపుణ్యమైన మానవ వనరులను అందించడంలో ఎన్‌ఏపీఎస్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. యువతకు నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు పరిశ్రమలకు అవసరమైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. లైఫ్ సైన్సెస్ స్కిల్ సెక్టార్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎల్‌ఎస్‌ఎస్‌ఎస్‌డీసీ), జేఎన్‌పీసీఎంఏ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఏపీ సెజ్ అచ్యుతాపురం ఇండస్ట్రీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎం. ప్రసాద్, ఎల్‌ఎస్‌ఎస్‌ఎస్‌డీసీ సౌత్ ఇండియా హెడ్ వి.అమరేంద్ర, డిప్యూటీ డైరెక్టర్ రాజన్ కౌల్, ఎన్‌ఎస్‌డీసీ స్టేట్ కో-ఆర్డినేటర్ కె.ప్రేమ్‌కుమార్, రెడ్డీస్ లేబొరేటరీస్ హెచ్‌ఆర్ మేనేజర్ లక్ష్మీదుర్గ, సిబ్బంది పాల్గొన్నారు.

కుమ్మరి శాలివాహన వృత్తిదారులకు సంక్షేమ పథకాలు

- రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పెరిపి ఈశ్వరరావు

రావికమతం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కుమ్మరి శాలివాహన వృత్తిదారులకు సంక్షేమ పథకాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర కుమరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పెరిపి ఈశ్వరరావు అన్నారు. మండలంలో కొత్తకోటలో ఒక ఫంక్షన్‌హాల్‌లో గురువారం జరిగిన జిల్లా కుమ్మరి శాలివాహన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటుకల తయారీకి ఉచితంగా మట్టిని సరఫరా చేయడానికి సంబంధించిన జీవో విడుదలకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ వృత్తిదారులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, గ్రామ శివారులో స్థలం కేటాయించాలని, 50 ఏళ్లు దాటిన వారందరికీ పింఛన్ మంజూరు చేయాలని, ప్రతి జిల్లాకు సామాజిక భవనాలు నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రంబాబునాయుడును కోరగా.. సానుకూలంగా స్పందించారన్నారు. పలు సమస్యల సాధనకు త్వరలో విజయవాడలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్టు ఆయన ప్రకటించారు. అంతకుముందు కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గల నాగేంద్ర, మండెంపూడి పురుషోత్తం మాట్లాడుతూ, కుమ్మరి కులాలను ప్రభుత్వాలు రాజకీయ, సామాజిక అంశాలలో గుర్తించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన జిల్లా అధ్యక్షుడు పొన్నాడ అప్పలకొండ, రాష్ట్ర శాలివాహన సంఘ డైరెక్టర్ దాలిపర్తి వేమన,విజయకుమారి, జిల్లా మహిళ అధ్యక్షురాలు లక్ష్మి పాల్గొన్నారు.

వైసీపీ శ్రేణులు హల్‌చల్

... 5వ పేజీ తరువాయి

అభివాదం తెలుపుతూ తాళ్లపాలెం వైపు కదిలారు. కొత్తూరు జంక్షన్‌లో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎలమంచిలి ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ, వైసీపీ పార్లమెంటు నియోజకవర్గం సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, అనకాపల్లి అసెంబ్లీ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు తదితరులు జగన్‌కు స్వాగతం పలికేందుకు వచ్చారు.

కశింకోట, తాళ్లపాలెంలో...

కశింకోట, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మధ్యాహ్నం 2.30 గంటలకు కశింకోటకు, మూడు గంటలకు తాళ్లపాలెం చేరుకున్నారు. తాళ్లపాలెం రాకముందే ముందే భారీ వర్షం పడడంతో కార్యకర్తలు చెల్లాచెదురయ్యారు. అంతకు ముందుగా జాతీయ రహదారిపైకి రావద్దంటూ పోలీసులు చెప్పినప్పటికీ కార్యకర్తలు తోసుకుంటూ రోడ్డుపైకి వచ్చారు. ద్విచక్ర వాహనాలపై రయ్ రయ్‌మంటూ వెళుతూ రప్పా..రప్పా.. అని నినాదాలు చేశారు. పోలీసులు రోప్‌తో నిలువరించే ప్రయత్నం చేసినప్పటికీ పట్టించుకోలేదు. జగన్ పర్యటన సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వుండేందుకు రంపచోడవరం ఏఎస్పీ జగదీశ్, అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, కశింకోట సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్‌ఐలు మనోజ్‌కుమార్, లక్ష్మణరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. జగన్ పర్యటన కారణంగా జాతీయ రహదారిపై ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా తాళ్లపాలెం కూడలిలో ఉన్న ఒక షాపు వద్ద స్థానిక వైసీపీ నాయకులు కూల్ డ్రింక్ సీసాలు, బిర్యానీ ప్యాకెట్లు వుంచారు. ఈ విషయం తెలుసుకున్న కార్యకర్తలు మూకుమ్మడిగా ఎగబడి వాటిని లాగేసుకున్నారు. ఈ క్రమంలో నాయకులు, కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. సీఐ స్వామినాయుడు సిబ్బందితో వెళ్లి పంపిణీని నిలిపివేయించారు. జగన్, మలసాల భరత్‌కుమార్ పేరుతో ముద్రించిన టీ- షర్టుల పంపిణీలో కూడా కార్యకర్తల మధ్య గొడవ జరిగింది.

మహిళకు స్వల్ప గాయాలు

వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెం జంక్షన్ వద్ద ఒక మహిళ గాయపడ్డారు. కశింకోట గ్రామానికి చెందిన తగరంపూడి నూకరత్నం, ఇతర మహిళా కార్యకర్తలతో కలిసి రోడ్డు పక్కన నిలబడి జగన్ కోసం ఎదురుచూస్తుండగా...వెనుక ఉన్న ఒకరు కాలు జారి ఆమెపై పడ్డారు. దీంతో నూకరత్నం కింద పడిపోవడంతో స్వల్పంగా గాయాలయ్యాయి. వెంటనే ఆర్‌ఎంపీ వద్దకు తీసుకువెళ్లి ప్రథమ చికిత్స అందించి ఇంటికి పంపించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగానే ఉన్నారని, ఈ విషయంపై ఎటువంటి అసత్య ప్రచారాలు చేయవద్దని సీఐ అల్లు స్వామినాయుడు పేర్కొన్నారు.

భోజన బకాయిలపై నవంబరు 13న ధర్నా

- ఎండీఎం సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి

చోడవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం బిల్లులు, కార్మికుల వేతన బకాయిలతో పాటు సమస్యలపై నవంబరు 13న డీఈవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు ఎండీఎం కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈ ఏడాది జూలై నుంచి బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, కార్మికుల వేతనాలు కూడా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. బిల్లులు మంజూరు చేయకుండా పథకం ఎలా నిర్వహిస్తారని ఆమె ప్రశ్నించారు. పాఠశాలలు తెరిచి నాలుగు నెలలు అవుతున్నా బకాయిలు క్లియర్ చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే బకాయిలు చెల్లించాలని ఆమె కోరారు. అలాగే నిర్వాహకులకు ఉచితంగా వంట గ్యాస్ సరఫరా, కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

ఆంధ్రా యూనివర్శిటీ జూడో జట్టుకు డిగ్రీ విద్యార్థి మధుబాబు ఎంపిక



మధుబాబు

సబ్బవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న శీరంశెట్టి మధుబాబు ఆంధ్రా యూనివర్సిటీ జూడో జట్టుకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ డాక్టర్ బి. శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో ఆంధ్రా యూనివర్శిటీ తరుపున మధుబాబు ఆడనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా మధుబాబును ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్, ఇతర అధ్యాపకులు అభినందించారు

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌కు బదిలీ

... 5వ పేజీ తరువాయి

ఎంఐజీ ప్లాట్లకు ప్రతిపాదనలు సిద్ధంచేశారు. ప్రతి పనిని నిర్దిష్ట సమయంలో పూర్తిచేసేలా సిబ్బందిని సమన్వయపరిచారు.

శ్రీమతికి బదిలీతో...

విశ్వనాథన్ శ్రీమతి విశ్వాంజలి గైక్వాజ్ ఐఎఫ్‌ఎస్ అధికారిణి. విశాఖపట్నం రీజియన్ పాస్‌పోర్టు అధికారిగా పనిచేసేవారు. రెండు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం ఆమెను తైవాన్‌కు అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా పంపింది. మూడేళ్ల వరకు ఆమె అక్కడే ఉంటారు. ఈ నేపథ్యంలో విశ్వనాథన్ ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రతించి తనను బదిలీ చేయాలని కోరారు. విశాఖ వచ్చి ఎక్కువ కాలమే అయినందున మరో శాఖలో పనిచేసే అవకాశం ఇవ్వాలని కోరడంతో ప్రభుత్వం అనుమతించి విజయవాడకు బదిలీ చేసింది.

పిచ్చికుక్క స్వైరవిహారం

... 5వ పేజీ తరువాయి



రావికమతం పీహెచ్‌సీలో కుక్కకాటు బాధితులు

గాఢ నిద్రలో వున్న బాలికలపై దాడి చేసింది. దీంతో వారంతా పెద్దగా కేకలు వేసి, తలో దిక్కుకు పరుగులు తీశారు. అయినాసరే కుక్క వెంటపడి కాళ్లు, చేతులు, ముఖంపై కరించింది. వెలంకాయల పావని, కుడే సౌజన్య, కోన ప్రసన్న, చొప్పగండి పూజిత, పోతల మౌక్తిత దుర్గ, వడ్డి నవ దుర్గ, సుంకర స్వప్న, మరిశా భావ్యశ్రీ, కె.స్వాతి, కిర్లంపల్లి దుర్గా భవానీ, పినబోయిన తనూజ, తేగాడ గీత కుక్కకాటుకు గురయ్యారు. పిచ్చికుక్క మళ్లీ గురువారం ఉదయం రావికమతంలో గర్నికం గ్రామానికి చెందిన ఆర్లె దేముడు, కేశంశెట్టి నాగమణి, మేడివాడకు చెందిన మీసాల చరణ్, సంపతి అన్నపూర్ణ, కుముదానిపేటకు చెందిన కోల నవీన్ ప్రసాద్, రావికమతానికి చెందిన వెచ్చా విశ్వ, సంపతి రమణమ్మ, ఎండీ దావూద్ అలం, బండారు అచ్యుతరావు, గోకాడ శ్రీరామమూర్తి, మైచర్ల కృష్ణమ్మలపై దాడిచేసి గాయ పరిచింది. అక్కడి నుంచి రావికమతం పక్కనే ఉన్న నాగన్నపాలెం వెళ్లి ఒక ఇంట్లోకి చొరబడి రెండేళ్ల బాలుడు కడులూరి చైతన్య వర్ధన్‌ను నోట కరుచుకుని బయటకు ఈడ్చుకొచ్చింది. చెవి, తలపైన కరిచి గాయపరిచింది. కుక్కకాటు బాధితులు స్థానిక పీహెచ్‌సీకి వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకున్నారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలైన రెండేళ్ల బాలుడు చైతన్య వర్ధన్‌ను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పంపారు. ఎంపీడీవో మహేశ్, డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి, ఎంఈఓ-2 బ్రహ్మాజీ ఆస్పత్రికి వెళ్లి పిచ్చికుక్క దాడిలో గాయపడిన వారిని పరామర్శించారు. కాగా పిచ్చికుక్కను గురువారం మధ్యాహ్నం నాగన్నపాలెంలో గుర్తించి, కర్రలతో కొట్టి హతమార్చారు. కాగా పిచ్చికుక్క దాడిలో 27 మంది గాయపడిన విషయం తెలుసుకున్న కలెక్టర్ విజయకృష్ణన్, రావికమతం పీహెచ్‌సీ వైద్యాధికారులకు వీడియో కాల్ చేసి ఆరా తీశారు

రోజూ వర్షమే!

... 5వ పేజీ తరువాయి

తలెత్తింది. వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కశింకోట మండలంలో గురువారం సాయంత్రం ఉరుములు, పిడుగులతో సుమారు గంటపాటు వర్షం దంచికొట్టింది. వీధులన్నీ జలమయం అయ్యాయి. తాళ్లపాలెం జంక్షన్ చెరువును తలపించింది. పరవాడ, పరిసర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం సుమారు అర గంటపాటు భారీ వర్షం కురిసింది. ఇప్పటికే నిండిన చెరువులు అలుగు పారాయి. గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో మోస్తరు వర్షం పడుంది. రహదారులపై వున్న గోతుల్లో నీరు చేరి వాహనదారులు ఇబ్బంది పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి నీరు చేరింది. నక్కపల్లి మండలం డొంకాడ, పరిసర మెరక గ్రామాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొండల వాగు పోటెత్తడంతో డొంకాడ వీధుల్లో వరద నీరు ప్రవహించింది. మాడుగుల మండలంలో చిరుజల్లులు పడ్డాయి.



వర్షం నీటితో చెరువును తలపిస్తున్న కశింకోట మండలం తాళ్లపాలెం జంక్షన్



నక్కపల్లి మండలం డొంకాడలో పోటెత్తిన వరద

రిచా ఘోష్ మెరుపు ఇన్నింగ్స్

... 5వ పేజీ తరువాయి

ప్రతికా రావల్ (37), స్మృతి మంధానా (23) శుభారంభం ఇచ్చినా మిడిల్ ఆర్డర్ ఘోరంగా విఫలమైంది. హర్లీన్ డియోల్ (13), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (9) సహా పలువురు తక్కువ స్కోరుకే అవుటయ్యారు.

రెచ్చిపోయిన రిచా ఘోష్

టాప్ ఆర్డర్ పెవిలియన్ దారిపట్టిన సమయంలో ఎనిమిదో స్థానంలో క్రీజులోకి వచ్చిన రిచా ఘోష్ రెచ్చిపోయి దక్షిణాఫ్రికా బౌలర్ల భరతం పట్టింది. 150 పరుగులు చేయడమే కష్టమనుకున్న సమయంలో రిచా ఘోష్ బౌండరీలు, సిక్సర్లతో చెలరేగి స్కోరు బోర్డును పరిగెత్తించింది. ఎదుర్కొన్న తొలి బంతి నుంచి సఫారీ బౌలర్లపై దాడికి దిగింది. దక్షిణాఫ్రికా సారథి లౌరా ఎప్పటికప్పుడు బౌలర్లను మార్చినా రిచాను నిలువరించడంలో సఫలం కాలేదు. ప్రతి ఓవర్‌లో కనీసం ఒక బౌండరీ బాది భారత్ శిబిరానికి ఉత్సాహానిచ్చింది. 43.5వ ఓవర్‌లో డి క్లెర్క్ బౌలింగ్‌లో సింగిల్ తీసి 53 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో అర్ధ సెంచరీతో (50) పూర్తిచేసింది. రిచాకు స్నేహ రానా తోడైంది. ఇద్దరూ కలిసి సఫారీ బౌలర్లకు చుక్కలు చూపారు. కేవలం 36 బంతుల్లో 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అర్ధ సెంచరీ తర్వాత మరింత మరింత రెచ్చిపోయిన రిచా ఘోష్ 46 ఓవర్లలో ఖాకా బౌలింగ్‌లో రెండు బౌండరీలు, ఇక సిక్సర్ బాదింది. భారత్ స్కోరు 251 చేరడానికి రిచా ఘోష్‌కు స్నేహ రానా అద్భుతమైన తోడ్పాటునిచ్చింది. రిచాతోపాటు రానా కూడా బంతులను బౌండరీలకు తరలిస్తూ సఫారీ బౌలర్లకు చెమటలు పట్టించింది. 42 ఓవర్‌లో మ్లాబా బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు కొట్టింది. మరోవైపు రిచా ఘోష్ సెంచరీకి చేరువవుతున్న సమయంలో ప్రేక్షకులలో ఉత్కంఠ నెలకొంది. వ్యక్తిగత స్కోరు 94 పరుగుల వద్ద అవుటైన రిచాను ప్రేక్షకులు నిలబడి హర్షధ్వానాలతో అభినందనలు తెలపడం ఆకట్టుకున్నది. లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా కెప్టెన్ లౌరా హాఫ్ సెంచరీతో (70) రాణించగా 81 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన దశలో బ్యాటింగ్‌కు దిగిన డీ క్లెర్క్ 54 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్సర్లతో (84 నాటౌట్) చెలరేగింది. 47 ఓవర్లో క్రాంతి గౌడ్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్సర్లు, ఒక బౌండరీ బాది మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసింది. 49వ ఓవర్లో అమన్‌జోత్ కౌర్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు బాది విజయానికి అవసరమైన 12 పరుగులను సాధించి దక్షిణాఫ్రికా జట్టుకు అనూహ్య విజయాన్నందించింది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529